ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHY
డాక్టర్ బీఆర్ అంబేడ్కర్
కోనసీమ
జిల్లా వార్తలు
శుక్రవారం 18 ఏప్రిల్ 2025 | 5

అమలాపురం ఉష్ణోగ్రతలు
గరిష్ఠం : 35.1
కనిష్ఠం : 27.0

ఏమి హాయిలే ఇలా..

36..40..42..45.. ఎంత ఉష్ణోగ్రత వచ్చినా మాకేం భయంలేదు.. భానుడు ఎంత ప్రతాపం చూపితే మాకు అంత ఆనందం అంటున్నారు గోదావరి పరీవాహక ప్రాంతం జనం.. వేసవి ఆరంభం నుంచి తూర్పుగోదావరి జిల్లా ధవళేశ్వరం బ్యారేజీ వద్ద ఒక్కటే సందడి.. గురువారం ఉదయం నుంచి సాయంత్రం వరకూ కూడా అలాగే ఉంది. జనంతో నిండిపోయింది. భానుడు ఉష్ణోగ్రత పెంచుతుంటే జనం కూడా అదే స్థాయిలో గోదారమ్మ చెంతకు చేరి ఇలా సేదతీరుతున్నారు.. కుటుంబంతో కలిసి గోదావరిలో స్నానాలు చేస్తూ ఆనందంగా గడుపుతున్నారు.. గోదారమ్మ ఒడిలో పెద్దలైనా చిన్న పిల్లల్లా మారిపోతున్నారు. నీటిలో మునుగుతూ తేలుతూ ఒళ్లంత.. తుళ్లింత కావాలిలే అంటూ ఆటలాడుతున్నారు. మహిళలు కూడా తరలివచ్చి స్నానాలు చేస్తున్నారు.. అయితే ఆనందంలో ఆదమరుపుగా ఉండొద్దు.. ఎటు నుంచి ఎటువంటి ప్రమాదం వస్తుందో చెప్పలేం.. తస్మాత్ జాగ్రత్త.. ఇరిగేషన్ అధికారులు సందర్శకులపై దృష్టి సారించాల్సి ఉంది.. గోదావరి ప్రమాదాలపై అవగాహన కల్పించి అప్రమత్తం చేయాల్సి ఉంది. - ఫొటోగ్రాఫర్, రాజమహేంద్రవరం





ఉప్పొంగిలే గోదావరి : గోదావరిలో సేదతీరుతున్న జనం





గురుకులాలు.. గాలికే!

కోట్లు ఊడ్చేసి.. కాంట్రాక్టు కంపెనీ కక్కుర్తి పనులు

సమస్యల మధ్యే చదువు సా..గుతోంది.. అయినా అటువైపు కన్నెత్తి చూసేవారే లేరు.. కనీసం పట్టించుకునేవారు కానరావడంలేదు.. నిధులు ఏమైనా లేవా అంటే అదీ కాదు.. కనీస పర్యవేక్షణ లేకపోవడంతో కాంట్రాక్టర్ ఇష్టారాజ్యంగా మారిపోయింది.. కోట్లు తీసుకున్నా.. కక్కుర్తి పనులు చేస్తూ విద్యార్థులను ఇబ్బందులకు గురిచేస్తున్నాడు.. ఇదీ ఉమ్మడి జిల్లావ్యాప్తంగా ఉన్న 21 అంబేడ్కర్ గురుకుల వసతి గృహాల్లో దుస్థితి.. కలుషిత నీళ్లు తాగుతూ.. అపరిశుభ్ర వాతావరణం మధ్య వేలాది మంది విద్యార్థులు నరకయాతన అనుభవిస్తున్నారు. కాంట్రాక్టు శానిటేషన్ కంపెనీ నిధులు మింగేసి నిర్వహణ గాలికొదిలేయడంతో సమస్యల మధ్యే చదువు సాగిస్తున్నారు. ప్రిన్సిపాళ్లు సైతం సదరు కంపెనీపై ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేసినా తీరు మార్చుకోవడం లేదు.

(కాకినాడ- ఆంధ్రజ్యోతి)

కోట్లాది రూపాయల మేర నిధులిస్తున్నారు.. చుట్టూ పెద్దఎత్తున అధికార యంత్రాంగం ఉంది. అయితే ఏం లాభం.. కనీసం అక్కడ ఏం జరుగుతుందో చూసే వారే కరువయ్యారు. విద్యార్థులు సమస్యల మధ్యే వసతి పొందుతున్నా పరిష్కరించే నాథులే కరువయ్యారు. ఇదెక్కడో కాదు.. ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాలోని అంబేడ్కర్ గురుకుల వసతిగృహాల్లో దుస్థితి. ఆ వసతి గృహాల్లో మంచినీటి ట్యాంకులు, ఆర్వో ప్లాంట్లను పరిశుభ్రంగా ఉంచాల్సిన కాంట్రాక్టర్ గాలి కొదిలేయడంతో విద్యార్థులకు కలుషిత నీరే దిక్కుగా మారింది. అటు వందల సంఖ్యలో ఉండే విద్యార్థుల హాస్టళ్లలో ఎప్పటికప్పుడు సెప్టిక్ ట్యాంకులు క్లీన్ చేయాల్సి ఉన్నా అదీ చేయడం లేదు. డ్రైనేజీ నిర్వహణ పట్టించు కోవడం లేదు. హాస్టల్ పరిసరాలను గాలికొదిలేశారు. గత వైసీపీ ప్రభుత్వ పెద్దల ఆశీస్సులతో టెండరు దక్కించుకున్న తెలంగాణకు చెందిన ఈ కంపెనీ ప్రభుత్వం మారినా అదే అరాచకం కొనసాగిస్తోంది. అటు విద్యార్థుల తల్లిదండ్రుల ఫిర్యాదుతో ఉమ్మడి జిల్లాలో నలుగురు ఎమ్మెల్యేలు సాంఘిక సంక్షేమశాఖ మంత్రికి లేఖలు రాసినా కాంట్రాక్టర్ ఖాతరు ఏమాత్రం చేయడం లేదు. సదరు బిల్లులు భారీగా బొక్కేస్తూ స్థానికంగా ఓ ఇద్దరు తాత్కాలిక ప్రైవేటు ఉద్యోగులకు హాస్టళ్లను సబ్ కాంట్రాక్టుకు ఇచ్చేసి తన బాధ్యతను వదిలేశాడు.

నలుగురు ఎమ్మెల్యేలు చెప్పినా..

ఉమ్మడి జిల్లాలో అంబేడ్కర్ గురుకుల వసతిగృహాల్లో శానిటేషన్ కంపెనీ నిర్లక్ష్యంపై ఆయా ప్రిన్సిపాళ్లు ఇప్పటికే ఉన్నతాధికారులకు నివేదికలు పంపించారు. ప్రభుత్వం మారినా కంపెనీ వైఖరి ఏమాత్రం మారలేదని నివేదికలో వివరించారు. మొత్తం 15 అంశాల్లో కంపెనీ కనీసం ఆరు అంశాల్లో కూడా పారిశుధ్య నిర్వహణ పాటించడం లేదని రిమార్కులతో నివేదికలు పంపారు. వీటిని పరిశీలించి సరిదిద్దాల్సిన జిల్లా కోఆర్డినేటర్ సైతం కంపెనీపై చర్యలు తీసుకునేలా పైఅధికారులకు సిఫార్సులు చేయలేదు. మరోపక్క ఈ వసతి గృహాల్లో శానిటేషన్ ఘోరంగా ఉందని విద్యార్థుల తల్లిదండ్రులు కొంతకాలం కిందట స్థానిక ఎమ్మెల్యేలకు సైతం ఫిర్యాదు చేశారు. దీంతో అంబేడ్కర్ కోనసీమ, కాకినాడ జిల్లాల్లో నలుగురు ఎమ్మెల్యేలు సాంఘిక సంక్షేమ శాఖ మంత్రికి నేరుగా లేఖలో ఫిర్యాదు చేశారు. అయినా కంపెనీ మాత్రం తన తీరు మార్చుకోలేదు.

13 వేల మంది విద్యార్థులు..

ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాలోని కాకినాడ, తూర్పుగోదావరి, కోనసీమ జిల్లాల్లో 21 చోట్ల అంబేడ్కర్ గురుకుల వసతి గృహాలు ఉన్నాయి. రాష్ట్ర సాంఘిక సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో ఆరో తరగతి నుంచి ఇంటర్ వరకు ఎస్సీ విద్యార్థులకు విద్యాభ్యాసంతోపాటు వసతి అందిస్తారు. ఉమ్మడి జిల్లాలో ప్రస్తుతం ఒక్కో వసతి గృహంలో 640 మంది విద్యార్థుల చొప్పున మొత్తం 13 వేల మంది ఉంటున్నారు. గురుకులాల్లో పూర్తి పరిశుభ్ర వాతావరణంలో చదు వు,వసతి ఉండేలా ప్రభుత్వం నిధులు వెచ్చిస్తోంది. పారిశుధ్య నిర్వహణకు కాంట్రాక్టర్‌ను నియమించి నెలకు కోట్లలో బిల్లులు చెల్లిస్తోంది. శానిటేషన్ కాంట్రాక్టు పొందిన కంపెనీ ప్రతి వసతి గృహానికి సిబ్బందిని నియమించి యూనిఫాం ఇచ్చి పనులు చేయించాలి. గత వైసీపీ ప్రభుత్వ పెద్దలు అనుకూలంగా ఉండడంతో ఎక్కడికక్కడ స్థానికంగా ఓ మనిషిని పురమాయించి వారితో అరకొర పనులు చేయిస్తూ నెట్టుకొచ్చింది. ప్రభుత్వం మారిన తర్వాత కూడా సదరు కంపెనీ అదే నిర్లక్ష్యం కొనసాగిస్తోంది. వసతి గృహం ఉన్న ప్రాంతంలో ఓ పనిమనిషికి రూ.5 వేల వరకు ఇచ్చి తూతూమంత్రంగా పనులు చేయిస్తోంది. కంపెనీ కోట్లలో దండుకుంటోంది.

గతేడాదే గడువు ముగిసినా..

గతేడాదే ఈ కంపెనీకి టెండరు గడువు పూర్తయింది. కానీ గత వైసీపీ పెద్దలు మాత్రం పనితీరు ఏమాత్రం బాగోలేని కంపెనీకి దాసోహమయ్యారు. తిరిగి మరో ఏడాది కాంట్రాక్టు పొడిగిస్తూ గతేడాది అడ్డగోలుగా నిర్ణయం తీసుకున్నారు. ఫలితంగా ఇప్పటికీ ఈ సంస్థ సేవలనే ప్రస్తుత ప్రభుత్వం కొనసాగిస్తోంది. అధికారులు సైతం రాష్ట్ర ప్రభుత్వం మారిన నేపథ్యంలో కంపెనీ నిర్లక్ష్యపు సేవలపై కనీసం సమీక్షించలేదు. మరోపక్క గురుకుల వసతి గృహాల్లో అప్పనంగా కోట్లలో డబ్బు బిల్లుల రూపంలో వస్తుండడంతో త్వరలో ముగిసిపోనున్న కాంట్రాక్టును మళ్లీ పొడిగించేందుకు సదరు కంపెనీ రాజకీయంగా పావులు కదుపుతోంది. ప్రస్తుత కూటమి ప్రభుత్వం టెండర్లు పిలిచినా మళ్లీ తామే కొనసాగేలా తెరవెనుక మంత్రాంగం నడుపుతోంది.

విద్యార్థులకు కలుషిత నీరే తాగునీరు..

ఉమ్మడి జిల్లాలో 21 వసతిగృహాల శానిటేషన్ కాంట్రాక్టును గత వైసీపీ ప్రభుత్వం తన అనుకూలంగా ఉండే తెలంగాణ రాష్ట్రం వరంగల్ జిల్లా హన్మకొండకు చెందిన కృష్ణ కన్‌స్ట్రక్షన్ కంపెనీకి 2023లో ఇచ్చింది. సదరు కంపెనీ కొద్దినెలలు మినహా ఆ తర్వాత పారిశుధ్య నిర్వహణ గాలికొదిలేసింది. నిబంధనల ప్రకారం ఈ కంపెనీ ఆయా హాస్టళ్లలో సిబ్బందిని నియమించుకుని పారిశుధ్య నిర్వహణ చేపట్టాలి. మూడు నెలలకోసారి ఓవర్‌హెడ్ ట్యాంకులు శుభ్రం చేసి మంచినీరందించాలి. అయితే ఏడాదిన్నరగా పూర్తిగా గాలికొదిలేసింది. హాస్టళ్లలో ఆర్వో వాటర్ ప్లాంట్లను ఎప్పటికప్పుడు క్లీన్ చేయాల్సి ఉన్నా చేయడం లేదు. దీంతో విద్యార్థులు కలుషిత నీటినే తాగుతున్నారు. కొన్నిచోట్ల ఇవి పాడైపోవడంతో బోరు నీరు తాగాల్సిన పరిస్థితి. వేలాది మంది విద్యార్థులు ఉండే హాస్టళ్లలో సెప్టిక్ ట్యాంకులను తరచూ శుభ్రం చేయించాలి.కానీ ఏడాదిన్నరగా పట్టించుకోవడం మానేసింది. దీంతో విద్యార్థులు దుర్వాసన మధ్యే వసతి పొందాల్సి వస్తోంది. హాస్టళ్లలో డ్రైనేజీ, ఇతర కాలువల్లో వ్యర్థాలు, ఇతర ఆహారం పేరుకుపోయి దుర్వాసన వెదజల్లుతున్నా సదరు కంపెనీ పట్టించుకోవడం లేదు. హాస్టళ్లన్నీ అపరిశుభ్ర వాతావరణంలో ఉంటున్నాయి. కానీ నెలనెలా మాత్రం ప్రభుత్వం నుంచి కోట్లాది రూపాయల బిల్లులు దండేసుకుంటోంది.

- అంబేడ్కర్ గురుకులాల్లో ఘోరం
- శానిటేషన్ నిర్వహణ గాలికి
- అపరిశుభ్రంగా వసతి గృహాలు
- గత వైసీపీ హయాంలో కాంట్రాక్టు
- నలుగురు ఎమ్మెల్యేల ఫిర్యాదు
- వసతిగృహాల ప్రిన్సిపాళ్లు నివేదికలు
- ఖాతరు చేయని కాంట్రాక్టు కంపెనీ
- మళ్లీ కాంట్రాక్టు పొడిగింపుపై కన్ను





నియోజకవర్గ అభివృద్ధికి నిధుల కేటాయింపులు చేయాలని ప్రతిపాదనలు అందిస్తున్న బండారు

స్థానిక అభివృద్ధికి నిధులివ్వండి!

- తవ్వకాలు చేసే ప్రాంతానికి నిధుల కేటాయింపునకు ప్రాధాన్యం ఇవ్వాల్సిందే
- ఓఎన్జీసీ తవ్వకాలపై నిర్వహించిన ప్రజాభిప్రాయ సేకరణ సభలో బండారు

ఆలమూరు, ఏప్రిల్ 17 (ఆంధ్రజ్యోతి): ఓఎన్జీసీ తవ్వకాల ద్వారా ఆర్జించే లాభాల్లో స్థానిక అభివృద్ధికి నిధులు కేటాయింపులు చేయాలని, ఈ విషయంలో దశాబ్దాలకాలంగా ఇక్కడ ప్రజల ఆకాంక్షను గుర్తించాలని కొత్తపేట ఎమ్మెల్యే బండారు సత్యానందరావు చెప్పారు. డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లాలో 122 చోట్ల ఓఎన్జీసీ చమురు, గ్యాస్ అన్వేషణకు తవ్వకాలు చేయడంలో భాగంగా ఆలమూరులో గురువారం ప్రజల వద్ద నుంచి సూచనలు, అభ్యంతరాలను స్వీకరించేందుకు జేసీ నిశాంతి అధ్యక్షతన ప్రజాభిప్రాయ సదస్సు నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా విచ్చేసిన ఎమ్మెల్యే బండారు సత్యానందరావు మాట్లాడుతూ చమురు, గ్యాస్ తవ్వకాల ద్వారా వచ్చే లాభాల్లో 3.5 శాతం స్థానిక అభివృద్ధికి నిధులు కేటాయింపులు చేయాల్సి ఉన్నా నిబంధన పాటించకుండా దశాబ్దాలుగా మోసగిస్తున్నారన్నది ఇక్కడ ప్రజల ఆరోపణ అని, వారి ఆవేదనను అర్థం చేసుకుని ఇకనైనా నిధులు కేటాయింపునకు చర్యలు చేపట్టాలని ఆయన డిమాండ్ చేశారు. ఓఎన్జీసీ సంస్థ భారీ వాహనాల వల్ల రోడ్లు ధ్వంసమైపోతున్నాయని, ముఖ్యంగా రైతులు ఇబ్బందులు పడుతున్నారని, వారికి సరైన న్యాయం చేయపోవడంతో అనేక ఫిర్యాదులు వస్తున్నప్పటికీ పట్టించుకోవడం లేదనే ఆరోపణ అధికంగా ఉందని చెప్పారు. ప్రజలు, రైతులకు ఎటువంటి ఇబ్బందులు లేకుండా చర్యలు తీసుకుంటామని జాయింట్ కలెక్టర్ నిశాంతి హామీనిచ్చారు. ఈ సదస్సులో పలువురు రైతులు, ప్రజాప్రతినిధులు, స్థానికులు పలు సమస్యలపై వినతిపత్రాలందించారు. వీటిని పరిశీలించి పరిగణలోనికి తీసుకుంటామని ఓఎన్జీసీ అధికారులు వివరించారు. కార్యక్రమంలో రామచంద్రపురం ఆర్డీవో అఖిల, ఓఎన్జీసీ హెచ్ఎస్ఈ జనరల్ మేనేజర్ కేవీకే రాజు, ఓఎన్జీసీ అధికారులు ఎల్ఆర్‌బీ నాయక్, తహశీల్దార్ ప్రకాష్‌బాబు పాల్గొన్నారు.

కేటాయింపులపై జేసీకి ప్రతిపాదనలు

కొత్తపేట నియోజకవర్గ పరిధిలో అభివృద్ధికి ఓఎన్జీసీ నిధుల కేటాయింపులు చేయాలని కోరుతూ ఓఎన్జీసీ ప్రజాభిప్రాయ సేకరణ సదస్సులో ఎమ్మెల్యే సత్యానందరావు రూ.84 కోట్లతో ప్రతిపాదనలు అందించారు. నియోజకవర్గం పరిధిలో సుదీర్ఘకాలంగా ఓఎన్జీసీ గ్యాస్, చమురు తవ్వకాలు చేయడం జరుగుతోందని, దీనివల్ల రోడ్లు, భవనాలు, బ్రిడ్జిలు, కల్వర్టులకు నష్టం కలిగిందని.. వీటిని నిర్మించడానికి సీజీఎఫ్ నిధుల నుంచి కేటాయింపులు చేయాలని కోరుతూ జాయింట్ కలెక్టర్ నిశాంతి సమక్షంలో ఓఎన్జీసీ అధికారులకు ప్రతిపాదనలు అందించారు. ఈ ప్రతిపాదనల్లో బ్రిడ్జిలు, వాడపల్లి వెంకటేశ్వరస్వామి ఆలయంలో మౌలిక సదుపాయాలు, రోడ్లు, స్కూల్ భవనాలు నిర్మాణాలకు నిధులు కేటాయింపులు చేయాలని ఎమ్మెల్యే బండారు సత్యానందరావు కోరారు. నిధులు కేటాయింపులకు చర్యలు తీసుకుంటామని ఓఎన్జీసీ అధికారులు హామీ ఇచ్చారు.

ఈదురుగాలులకు కూలిపోయిన 132 కేవీ విద్యుత్ టవర్

7



వీడియో కాన్ఫరెన్సులో పాల్గొన్న కలెక్టర్ మహేష్‌కుమార్, అధికారులు

స్టాకు యార్డుల్లో 20 లక్షల మెట్రిక్ టన్నుల ఇసుక నిల్వ చేయాలి

- ఎంఎస్ఎంఈ పార్కుల ఏర్పాటుకు స్థలాలు ఎంపిక
- కలెక్టర్ మహేష్‌కుమార్

అమలాపురం, ఏప్రిల్17(ఆంధ్రజ్యోతి): వర్షాకాలంలో సైతం భవన నిర్మాణరంగంలో నిరంతరాయంగా పనులు కొనసాగించేలా స్టాకుయార్డుల్లో 20లక్షల మెట్రిక్ టన్నుల ఇసుకను నిల్వ చేయాలని కలెక్టర్ ఆర్.మహేష్‌కుమార్ ఆదేశించారు. ఉచిత ఇసుక పాలసీని అమలుచేయాలన్నారు. మాన్యువల్ సెమీ మెకనైజ్డ్ రీచ్‌లలో ఉన్న ఇసుక తవ్వకాలను మే, జూన్ మాసాల్లో ముమ్మరంచేసి స్టాకు యార్డులకు రోజువారీ లక్ష్యాలతో ఇసుకను తరలించి నిల్వ చేయాలన్నారు. అసెంబ్లీ నియోజకవర్గాల వారీగా సూక్ష్మ, చిన్న, మధ్యతరహా పరిశ్రమలు (ఎంఎస్ఎంఈ) పార్కుల ఏర్పాటుకు జిల్లాలోని ముమ్మిడివరం, రాజోలు, పి.గన్నవరం అసెంబ్లీ నియోజకవర్గాల్లో స్థలాలను ఎంపిక చేశామన్నారు. మరో నాలుగు నియోజకవర్గాల్లో స్థలాలు ఎంపిక చేయాల్సి ఉందని కలెక్టర్ తెలిపారు. గురువారం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కె.విజయానంద్ అమరావతి నుంచి నిర్వహించిన వీడియో కాన్ఫరెన్సులో కలెక్టర్ పాల్గొన్నారు. ప్రధానంగా ఉచిత ఇసుక పాలసీ విధానం, సౌరశక్తి ప్రాజెక్టుల ఏర్పాటుకు భూసేకరణ, వేసవిలో తాగునీటి ఎద్దడి నివారణ తదితర అంశాలపై ఆయన సమీక్షించారు. తర్వాత కలెక్టర్ మహేష్‌కుమార్ అధికారులను ఉద్దేశించి మాట్లాడారు. కొత్తగా గుర్తించిన ఇసుక రీచ్‌లకు కాలుష్య నియంత్రణ మండలి పర్యావరణ అనుమతులు వారం రోజుల్లో పొందుతూ తవ్వకాలు వేగవంతం చేయాలన్నారు. సౌరశక్తి ప్రాజెక్టుల కోసం ప్రభుత్వ భూములు, పట్టా భూములను డిసెంబరు నాటికి ఎంపిక చేయాలన్నారు. ఆయా స్థలాలను నెడ్‌క్యాప్ వారికి అప్పగించాలన్నారు. పంట కాల్వలు మూసివేసేలోగా సమ్మర్ స్టోరేజ్ ట్యాంకులను నూరుశాతం నింపుకుని వేసవిలో సాగునీటి ఎద్దడి సమస్యలు ఉత్పన్నం కాకుండా అప్రమత్తంగా ఉండాలన్నారు. ఎన్టీఆర్ భరోసా పెన్షన్ల పంపిణీలో అసభ్య ప్రవర్తనకు తావు లేకుండా లబ్ధిదారులతో మర్యాదగా వ్యవహరించాలన్నారు. ఆసుపత్రి సేవల నిర్వహణ పట్ల ఐవీఆర్ఎస్ ద్వారా ప్రజా సంతృప్తి స్థాయిలను ఎప్పటికప్పుడు అంచనావేసి జిల్లాలకు గ్రేడింగ్ ఇవ్వడం జరుగుతుందన్నారు. ఎంఎస్ఎంఈ పార్కుల కోసం ఎంపికచేసిన స్థలాలకు రాకపోకలకు అనువైన వసతులు పరిపూర్ణంగా ఉండాలన్నారు. స్వర్ణాంధ్ర-స్వచ్ఛాంధ్ర కార్యక్రమాన్ని మూడో శనివారం ఈనెల 19న నిర్వహిస్తూ ఎలక్ట్రానిక్ వ్యర్థాలు (ఈవేస్ట్) రీసైక్లింగ్ ఇతివృత్తంతో ప్రజాప్రతినిధుల భాగస్వామ్యంతో చేపట్టాలన్నారు. సమావేశంలో డీపీవో డి.శాంతలక్ష్మి, మున్సిపల్ కమిషనర్లు వీఐపీ నాయకుడు, కేవీఆర్ఆర్ రాజు, భూగర్భశాఖ ఏడీ ఎల్.వంశీధర్‌రెడ్డి, ఆర్‌డబ్ల్యుఎస్ డివిజనల్‌ఇంజనీర్ పద్మనాభం, జలవనరులశాఖ కార్యనిర్వాహక ఇంజనీర్ బి.శ్రీనివాసరావు, జిల్లా పరిశ్రమల కేంద్రం జనరల్ మేనేజర్ వీకేపీ ప్రసాద్, డీఐపీఆర్వో కె.లక్ష్మీనారాయణ, టెక్నికల్ కోఆర్డినేటర్ సువిజయ్, రియాల్టీ ఇనస్పెక్టర్ పి.సుజాత పాల్గొన్నారు.

మే 1 నుంచి తవ్వకాలు నిర్వహించాలి

జిల్లాలో ఐదు సెమీమెకనైజ్డ్ ఇసుక రీచ్‌లలో మే 1 నుంచి తవ్వకాలు నిర్వహించేలా చర్యలు తీసుకోవాలని కలెక్టర్ ఆర్.మహేష్‌కుమార్ జిల్లా ఇసుక కమిటీ సభ్యులకు సూచించారు. కలెక్టరేట్‌లో మహేష్‌కుమార్ అధ్యక్షతన గురువారం జిల్లా ఇసుక కమిటీ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలోని గోపాలపురం, జొన్నాడ, అమలాపురం, రావులపాడులలో కొత్తగా ఇసుక స్టాకు డిపోలను గుర్తించి ఆమోదించామని చెప్పారు.



గురుకుల పాఠశాలలో విద్యార్థుల సమస్యలు అడిగి తెలుసుకుంటున్న ఆర్డీవో

గురుకుల పాఠశాలలో ఆర్డీవో ఆకస్మిక తనిఖీ

ముమ్మిడివరం,ఏప్రిల్17(ఆంధ్రజ్యోతి): ముమ్మిడివరం సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాలలో చోటుచేసుకున్న ఘటనలపై అమలాపురం ఆర్డీవో కె.మాధవి గురువారం సందర్శించి విద్యార్థినుల సమస్యలు అడిగి తెలుసుకున్నారు. గురుకుల పాఠశాలలో నిల్వ సరుకులతో వంట చేసేందుకు ప్రయత్నించగా పేరెంట్స్ కమిటీ సభ్యులు అడ్డుకోవడం.. రాష్ట్ర ఫుడ్ కమిషన్ సభ్యుడు జక్కంపూడి కిరణ్ ఆకస్మికంగా తనిఖీ నిర్వహించడం, వంటశాల పరిశీలించి అక్కడ పారవేసిన పుచ్చిన వంకాయలు, బెండకాయలు, ఆనబకాయలను గుర్తించడం, ఈ వ్యవహారంపై ఫుడ్ ఇనస్పెక్టర్ సుబ్బారావు, డీసీవో శైలజలకు ఫిర్యాదు అందడం, దానిపై వారు బుధవారం గురుకుల పాఠశాలను సందర్శించి స్టోర్ రూములో నిల్వ రాగిపిండి ప్యాకెట్‌ను గుర్తించి వాటిని సీజ్ చేసిన విషయం విదితమే. జిల్లా కలెక్టర్ ఆదేశాలతో అమలాపురం ఆర్డీవో కె.మాధవి, నగర పంచాయతీ కమిషనర్ పి.రవివర్మలతో కలిసి గురువారం గురుకుల పాఠశాలను సందర్శించి విచారించారు. పేరెంట్స్ కమిటీ సభ్యుల నుంచి అక్కడ జరుగుతున్న అవకతవకలపై సమాచారం సేకరించారు. ప్రిన్సిపాల్ టి.గంగాభవానీ అధ్యాపకులు, సిబ్బందిని ఆమె విచారించారు. గురుకుల పాఠశాలలో తరగతి గదులు, వసతి, వంటగదులను ఆమె పరిశీలించారు. స్టోర్‌రూములో పాడైన చింతపండు, ఇతర వంట సరుకులు ఉండడాన్ని గుర్తించి వాటిని పడేయాలని, బాత్‌రూములు అపరిశుభ్రంగా ఉండడాన్ని గుర్తించి వాటి శుభ్రతకు చర్యలు చేపట్టాలని ఆదేశించారు. ఎలుకలు కరిచిన విద్యార్థినులను పరామర్శించి, వారికి వైద్యసేవలు అందించాలని ప్రిన్సిపాల్‌ను ఆదేశించారు. విచారణ నివేదికను కలెక్టర్‌కు నివేదిస్తామని ఆమె మీడియాకు వెల్లడించారు. ఆమె వెంట ముమ్మిడివరం తహశీల్దార్ ఎంవీ సుబ్బలక్ష్మి, ఎంపీడీవో తాడి శ్రీవెంకటాచార్య ఉన్నారు.

కోనసీమకు విద్యుత్ శాపం



మలికిపురం, ఏప్రిల్ 17 (ఆంధ్రజ్యోతి): కోనసీమ జిల్లాకు మూడు రోజుల నుంచి కరెంటు శాపంలా మారింది. గత మంగళవారం రాత్రి కోటిపల్లిలో 132 కేవీ టవర్ కూలిపోవడంతో మూడు రోజుల నుంచి కోనసీమ జిల్లాలోని అమలాపురం, కొత్తపేట, ముమ్మిడివరం, రాజోలు నియోజకవర్గాల్లోని ప్రజలు రాత్రి సమయంలో చీకటిలో గడుపుతున్నారు. అధికారులకు ముందుచూపు లేకపోవడం, ఉన్నతాధికారుల నిర్లక్ష్యం ప్రజల పాలిట శాపంగా మారింది. సరిపడా విద్యుత్ ఉన్నా వాటిని ఉపయోగించుకోలేని పరిస్థితి ఏర్పడింది. ముమ్మిడివరం, కొత్తపేట, అమలాపురం, రాజోలు నియోజకవర్గాలకు 200 మెగా వాట్ల విద్యుత్ అవసరం ఉంది. కోటిపల్లి టవర్ కూలడంతో ఉండి 220 కేవీ, భీమవరం 132 కేవీల నుంచి ఈ ప్రాంతాలకు విద్యుత్ సరఫరా కొనసాగించారు. అయితే 200 మెగా వాట్ల విద్యుత్ అవసరం ఉండగా 106 మెగా వాట్లు మాత్రమే సరఫరా అవుతోంది. విద్యుత్ అందుబాటులో ఉన్నప్పటికీ ఈ రెండు సబ్‌స్టేషన్ల నుంచి సరిపడా విద్యుత్‌ను పంపితే కాలం చెల్లిన విద్యుత్ తీగలు తెగిపోయే అవకాశం ఉండడంతో 130 మెగావాట్లతో సరిపెట్టారు. మిగిలిన లోటు విద్యుత్‌ను ఎమర్జెన్సీ లోడ్ రిలీఫ్ పేరుతో ప్రతీ రెండు గంటలకు నిలిపి వేస్తున్నారు. విద్యుత్ ఉన్నతాధికారులు ఇటువంటి యాంగిల్ టవర్ ఉన్నచోట నిరంతరం పర్యవేక్షణతో కాపాడాలని, లేకపోతే ఇటువంటి సమస్యలు తప్పవని ఒక సీనియర్ అధికారి తెలిపారు. పశ్చిమగోదావరి జిల్లాలో ఇటువంటి సమస్యలు ఏర్పడతాయనే ఉద్దేశంతో ప్రత్యామ్నాయ పద్ధతులను కూడా అమలుచేస్తున్నారు. ఇక్కడ కూడా ప్రత్యామ్నాయ సర్క్యూట్ ఏర్పాట్లకు ఆలోచన చేయడం లేదు. కోనసీమలో దశాబ్దాల కిందట ఏర్పాటుచేసిన ఈ యాంగిల్ టవర్లన్నీ పాడు పడే స్థితికి వచ్చాయని, ప్రతీ సబ్‌స్టేషన్‌కు ఒక లైను నుంచి అంతరాయం ఏర్పడితే మరో లైను నుంచి వెంటనే విద్యుత్‌ను పునరుద్ధరించే పద్ధతిని అందుబాటులోకి తీసుకురావాలని ప్రజలు కోరుతున్నారు. గత మంగళవారం నుంచి విద్యుత్ సరఫరా లేక ఆక్వా రైతులు డీజిల్ కొనలేక ఇబ్బందులు పడ్డారు. ఇన్వర్టర్లు లేని జనం పడిన పాట్లు వర్ణనాతీతం.



పాపాలకు ప్రాయశ్చిత్తం.. లోకానికి వెలుగు మార్గం!

- పవిత్ర దినం పరిశుద్ధ శుక్రవారం
- చర్చిల్లో గుడ్‌ఫ్రైడే ఆరాధనలు
- క్రైస్తవులంతా భక్తిశ్రద్ధలతో ప్రార్థనలు
- ఏసుక్రీస్తు పలికిన ఏడు మాటలే శిరోధార్యం

కార్పొరేషన్(కాకినాడ), ఏప్రిల్ 17(ఆంధ్రజ్యోతి): యేసు క్రీస్తు సిలువ వేసిన సందర్భాన్ని, ఆయన మరణాన్ని గుర్తుచేసుకునే రోజునే క్రైస్తవులు పవిత్రదినంగా భావిస్తారు. దీన్నే గుడ్ ఫ్రైడే, పవిత్ర శుక్రవారం, బ్లాక్ ఫ్రైడే, హోలీ ఫ్రైడే, గ్రేట్ ఫ్రైడే, గ్రేట్ అండ్ హోలీ ఫ్రైడే, లేదా లార్డ్ పాషన్ ఫ్రైడే అని కూడా పిలుస్తారు. మానవాళిచేసిన పాపాల కోసం ప్రాయశిత్తంగా తన ప్రాణాలను ఏసుక్రీస్తు అర్పించాడని క్రైస్తవులంతా భావిస్తారు. ఆయనను శిలువకు వేలాడదీసిన రోజే పవిత్ర శుక్రవారంగా భావించి ప్రత్యేక ప్రార్థనలు చేస్తారు. నిజానికిది బాధతో కూడిన రోజు కావడంతో ఎంతో భక్తిశ్రద్ధలతో గుడ్‌ఫ్రైడేను జరుపుకోవడం చేస్తారు. గుడ్‌ఫ్రైడే సందర్భంగా ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాలోని కాకినాడ జిల్లాలో రామారావుపేట, గాంధీనగర్, జగన్నాథపురం ప్రాంతాల్లోని పురాతన చర్చిలు, అంబేడ్కర్ కోనసీమ జిల్లాలో అమలాపురం, ముమ్మిడివరం, రాజోలు ప్రాంతాల్లో చర్చిల్లో, తూర్పుగోదావరి జిల్లా రాజమహేంద్రవరంలో పురాతన చర్చిల్లో క్రైస్తవులంతా శుక్రవారం ఉదయం 9గంటల నుంచి సాయంత్రం 3గంటల వరకు చర్చిల్లో ఆరాధనలు చేస్తారు. క్రైస్తవులంతా భక్తిశ్రద్ధలతో ప్రత్యేక ప్రార్థనలు నిర్వహిస్తారు. ఈ సందర్భాన్ని పురస్కరించుకుని సిలువలో ఏసుక్రీస్తు పలికిన ఏడు మాటలు ధ్యానిస్తారు. ఈస్టర్ ఆదివారం ముందు వచ్చే శుక్రవారం రోజును క్రైస్తవులు పాపాలకు ప్రాయశ్చిత్త ంగా ఏసుక్రీస్తు సిలువ మరణాన్ని జ్ఞాపకం చేసుకుంటారు. అలాగే ఏసు మరణానికి, ఆయన పునరుత్థానానికి మధ్య ఉన్న మూడు రోజులను పవిత్ర దినాలుగా భావిస్తారు. గుడ్‌ఫ్రైడే ఆరాధన.. అందరి పాపాల కోసం తన జీవితాన్ని త్యాగం చేయడం ద్వారా ఏసుక్రీస్తు అందరి కోసం అనుభవించిన బాధలను ప్రతిబింబించమని ఆహ్వానిస్తుంది. గుడ్‌ఫ్రై డే రోజున ప్రాయశ్చిత్తం, ప్రార్థనలు మాత్రమే చేసుకునే రోజు. ముఖ్యంగా ఈరోజు చర్చిల్లో గంటలు మోగించకూడదు. క్రైస్తవ ధర్మం పాటించేవారు మాంసాహారం తినరు. ఉపవాసం చేస్తారు. శిలువ వేసిన గుర్తుగా కొయ్యతో చేసిన శిలువలను ధరించి చర్చిల్లో ప్రార్థిస్తారు. అలా గే శిలువ కొయ్యలతో ప్రదర్శనగానూ నిర్వహిస్తారు. కొన్నిచోట్ల నల్లటి వస్త్రాలు ధరించి క్రీస్తును స్మరిస్తూ ముందుకు సాగుతారు. గుడ్‌ఫ్రైడే ప్రతి ఏటా తేదీ మారుతుంది. మూన్ క్యాలెండర్ ప్రకారం ఈస్టర్ ముందు వచ్చే శుక్రవారాన్ని గుడ్‌ఫ్రైడేగా చేసుకుంటారు. దీంతో లెంట్ డేస్ పూర్తవుతాయి. గుడ్‌ఫ్రైడే రోజు ఏసును శిలువ వేస్తే.. ఆదివారం పునరుత్థానం చెందాడని ఈస్టర్ పండుగ చేస్తారు.

యేసుక్రీస్తు సిలువపై పలికిన ఏడు మాటలు

1. తండ్రి వీరేమి చేయుచున్నారో వీరెరుగరు గనుక వీరిని క్షమించుము. లుకా 23:34
2. నేడు నీవు నాతో కూడా పరదైసులో ఉందువు. లుకా 23:43
3. అమ్మా, ఇదిగో నీ కుమారుడు. ఇదిగో నీ తల్లి. యోహాను 19:26,27
4. నా దేవా, నా దేవా నన్నెందుకు చెయ్యి విడిచితివి. మత్తయి 27:46
5. నేను దప్పిగొని యున్నాను. యోహాను 19:28
6. సమాప్తమైనది. యోహాను 19:30
7. తండ్రి నీ చేతికి నా ఆత్మను అప్పగించుకొనియున్నాను. లుకా 23:46

ఉమ్మడి తూర్పు గోదావరి జిల్లాలో ఈ నెల 20వ తేదీ వరకు


రేషన్‌లో బియ్యం

కలెక్టరేట్ (కాకినాడ), ఏప్రిల్ 17 (ఆంధ్రజ్యోతి): ఉమ్మడి తూర్పు గోదావరి జిల్లాలోని ప్రభుత్వ చౌక ధరల దుకాణాల్లో ఈ నెల 20వ తేదీ వరకు సరుకులు పంపిణీ చేయనున్నారు. ఈ నెల 17వ తేదీతో రేషన్‌లో బియ్యం, పంచదార పంపిణీ గడువు ముగిసింది. అయితే లబ్ధిదారుల సౌకర్యార్థం గడువు మరో మూడు రోజులు పెంచారు. ఇప్పటి వరకు తూర్పుగోదావరి జిల్లాలో 5,64,994 రేషన్ కార్డుదారులకు గాను 5,19,660 మందికి రేషన్ సరుకుల పంపిణీ జరిగింది. అంటే 91.67 శాతం పంపిణీ నమోదు అయింది. అలాగే కాకినాడ జిల్లాలో 6,33,874 రేషన్ కార్డుదారులకు 5,80,432 కార్డుదారులకు పంపిణీ చేశారు. అంటే 90.14 శాతం రేషన్ పంపిణీ చేశారు. డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లాలో 5,37,902 రేషన్ కార్డుదారులకు 4,81,484 రేషన్ కార్డుదారులకు పంపిణీ చేశారు. ఇక్కడ 89.51 శాతం పంపిణీగా నమోదైంది. ఈ నేపథ్యంలో మరో మూడు రోజులు గడువు పెంచి నూరు శాతం లబ్ధిదారులకు బియ్యం, పంచదార పంపిణీ చేయాలని పౌరసరఫరాల శాఖ అధికారులు నిర్ణయించారు. ప్రభుత్వం పంపిణీ చేసే బియ్యం ప్రతి ఒక్క లబ్ధిదారుని ఇంటికి చేరుకోవాలని కూటమి ప్రభుత్వం సంకల్పించింది.

20న క్రికెట్ ఎంపికలు

కార్పొరేషన్ (కాకినాడ), ఏప్రిల్ 17 (ఆంధ్రజ్యోతి): తూర్పు గోదావరి జిల్లా క్రికెట్ అసోసియేషన్ ఆధ్వర్యంలో 2025-26 సంవత్సరానికి పురుషులు అండర్-23, సీనియర్స్ ఎంపికలు జరుగుతున్నాయని జిల్లా సెక్రటరీ పిసత్యనారాయణ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉమ్మడి తూర్పు గోదావరి జిల్లాలో ఆసక్తి కలిగిన అభ్యర్థులు ఈ నెల 20న ఉదయం 9 గంటలకు కాకినాడ రంగరాయ మెడికల్ కాలేజ్ క్రికెట్ గ్రౌండ్‌లో జరిగే ఎంపికలకు హాజరుకావాలని కోరారు. అండర్-23 పురుషులు కచ్చితంగా 2002 సెప్టెంబరు 1లోపు జన్మించి ఉండాలి. ఎంపికలకు హాజరయ్యే పురుషులు తప్పనిసరిగా తెల్లని దుస్తులు, బూట్లు, సొంత కిట్టు తీసుకురావాలి. జన్మదిన పత్రం, ఆధార్ కార్డు, స్కూల్ నుంచి టెన్త్ క్లాస్ మార్క్స్ సర్టిఫికెట్ తీసుకురావాలి.

రక్తంతో ఏసుక్రీస్తు చిత్రం





చిత్రాన్ని వేసిన మండపల్లి శ్రీచరణ్

మండపేట శ్రీసత్య డ్రాయింగ్ అకాడమీ విద్యార్థి మండపల్లి శ్రీచరణ్ ఏసుక్రీస్తు పట్ల తన ఆరాధనా భావాన్ని ప్రత్యేక కోణంలో వ్యక్తం చేశాడు. గుడ్‌ఫ్రైడే సందర్భంగా ఏసు చిత్రాన్ని గీసేందుకు తన రక్తాన్నే రంగులుగా మలుచుకున్నాడు. అతని కుంచె నుంచి జాలువారిన రక్త రేఖలతో రూపుదిద్దుకున్న ఏసు చిత్రం చూపరులను ఆకట్టుకుంటోంది. ఇంటర్ చదివిన శ్రీచరణ్ మండపల్లి సత్యానందం వద్ద చిత్రలేఖనం నేర్చుకుంటున్నాడు. - మండపేట/ఆంధ్రజ్యోతి

ముగిసిన ఏపీఎస్పీ రేంజ్-1 క్రీడా పోటీలు



పరుగు పందెంలో...

కాకినాడ రూరల్, ఏప్రిల్ 17 (ఆంధ్రజ్యోతి): కాకినాడ జిల్లా కాకినాడ రూరల్ మండలం రమణయ్యపేటలోని ఏపీఎస్పీ 3వ బెటాలియన్ మైదానంలో మూడు రోజులు జరిగిన ఏపీఎస్పీ రేంజ్-1, గేమ్స్, క్రీడా పోటీలు గురువారం సాయంత్రం ముగిసాయి. ముఖ్య అతిథిగా ఐజీపీ బి.రాజకుమారి, డీఐజీ ఫకీరప్ప హాజరయ్యారు. 3వ బెటాలియన్ కమాండెంట్ ఎం.నాగేంద్రరావు మాట్లాడుతూ క్రీడా పోటీలు నిర్వహించే అవకాశాన్ని తమ బెటాలియన్‌కు ఇచ్చినందుకు అధికారులకు ధన్యవాదాలు తెలిపారు. అనంతరం ముఖ్య అతిథి రాజకుమారి మాట్లాడుతూ క్రీడల్లో పాల్గొనడం ద్వారా మానసిక ఉల్లాసం కలుగుతుందన్నారు. ఫకీరప్ప మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ శారీరక వ్యాయామం చేయాలన్నారు. అనంతరం పలు పోటీల్లో విజేతలకు బహుమతులు, సర్టిఫికెట్లను అతిథులు అందజేశారు. ఈ సందర్భంగా నిర్వహించిన బాణసంచా కాల్పులు, సాంస్కృతిక ప్రదర్శనలు ఆకట్టుకున్నాయి. కమాండెంట్లు రామకృష్ణ, సుస్మిత, అదనపు కమాండెంట్ దేవానందరావు, అసిస్టెంట్ కమాండెంట్లు చంద్రశేఖర్, మన్మధరావు, ఆర్ఐలు అజయ్‌కుమార్, రవిశంకర్, వితలేశ్వరరావు, ప్రసాద్, 3వ బెటాలియన్ పాఠశాల ప్రిన్సిపాల్, విద్యార్థులు పాల్గొన్నారు.



పరుగో... పరుగు





విజేతలకు బహుమతులు అందజేస్తున్న డీఐజీ ఫకీరప్ప, 3వ బెటాలియన్ కమాండెంట్ నాగేంద్రరావు

సరళం, సులభం, సత్వర న్యాయం

ప్లాపస్!

- తెల్ల కాగితంపై ఫిర్యాదు రాసిస్తే చాలు
- విద్యుత్, తాగునీరు, వీధి దీపాలు, రవాణా, వైద్యం, విద్య ఇబ్బందులపై ఆధారాలు ఏదైనా సరే.. మెరిట్స్ ప్రకారం తీర్పు
- న్యాయవాది అవసరం లేదు..
- కోర్టు ఫీజు ఉండదు
- తీర్పుపై అప్పీలుకు అవకాశం లేదు
- కార్యాలయాల చుట్టూ తిరిగే అవసరం లేదు

ఆస్పత్రిలో వైద్యపరంగా ఇబ్బంది ఉందా?... బీమా, విద్యా సంస్థలు ఇబ్బంది పెడుతున్నాయా?... తాగునీరు, వీధి దీపాల సమస్య ఉందా?... ప్రభుత్వాధికారులకు విన్నవించినా పట్టించుకోవట్లేదా?... న్యాయం జరగట్లేదని నిస్సహాయ స్థితిలో ఉన్నారా?... దిక్కెవరని కుమిలిపోతున్నారా?.. వీటన్నిటికీ సమాధానమే 'ప్లాపస్'. ప్రజల దైనందిన జీవనంలో ఎదురయ్యే ఎన్నో సమస్యలకు అద్భుతమైన పరిష్కార వేదిక. ప్రజల్లో అవగాహన లేకపోవడంతో ఎంతో అమూల్యమైన సేవలు అక్కరకు రాకుండా పోతున్నాయి. ఒక జడ్జి ఆధ్వర్యంలో విచారణ జరిగి తీర్పు (అవార్డు) ఇచ్చే సంస్థను జనం ఉపయోగించుకోలేకపోతున్నారు. సహజ న్యాయసూత్రాలే ప్రాతిపదికగా, కోర్టు ఫీజులు లేకుండా, సరళమైన ప్రక్రియతో త్వరితగతిన న్యాయం అందించే అధికారాలున్న 'ప్లాపస్'పై ఆంధ్రజ్యోతి ప్రత్యేక కథనం.



(రాజమహేంద్రవరం-ఆంధ్రజ్యోతి)

'పర్మనెంట్ లోక్ అదాలత్ ఫర్ పబ్లిక్ యుటిలిటీ సర్వీసెస్'నే ప్లాపస్ అంటారు. న్యాయ సేవాధికారాల చట్టం-1987కి 37/2002 సవరణలో చాప్టర్ 6(ఎ)లో సెక్షన్లు 22(ఎ) నుంచి (ఇ) వరకు తెలియజేశారు. త్వరితంగా, ఇంపార్షియల్‌గా ప్రజలకు సేవలందించడం, మామూలు కోర్టులపై పని ఒత్తిడి భారాన్ని తగ్గించడం ప్లాపస్ ముఖ్య ఉద్దేశాలు. ఉమ్మడి తూర్పుగోదావరికి సంబంధించి 2016లో ప్లాపస్ మనుగడలోకి వచ్చింది. ఒక ఛైర్‌పర్సన్, ఇద్దరు సభ్యులు విచారణ జరిపి మెజారిటీ అభిప్రాయాన్ని తీర్పుగా ప్రకటిస్తారు. జాతీయ స్థాయి నుంచి మండల స్థాయి వరకు లీగల్ సర్వీసెస్ అథారిటీ (లోక్ అదాలత్)లు ఉన్నా వాటి విధులకు ప్లాపస్‌కి స్పష్టమైన తేడా ఉంది. ఇరు పక్షాలు రాజీ పడకపోతే లోక్ అదాలత్‌లు ఏ పక్షానా తీర్పు ఇవ్వడానికి కుదరదు. ప్లాపస్‌లో మాత్రం ఆధారాలు, మెరిట్స్‌ని అనుసరించి తీర్పు వెలువరిస్తారు.



● ఉమ్మడి జిల్లాలో...

ఉమ్మడి తూర్పు గోదావరికి సంబంధించి రాజమహేంద్రవరంలోని జిల్లా కోర్టుల ప్రాంగణంలో లోక్ అదాలత్ భవనం మొదటి అంతస్తులో ప్లాపస్ ఉంది. ఇక్కడికి నేరుగా వచ్చి ఫిర్యాదు చేయాల్సి ఉంటుంది. ఎలాంటి రుసుమూ చెల్లించాల్సిన అవసరం ఉండదు. ఒకవేళ చదువు రాకపోయినా దిగాలు చెందాల్సిన అవసరం లేదు. లీగల్ ఎయిడ్ సిబ్బంది సహాయం చేస్తారు. ఏ భాషకు చెందిన వారైనా ఇబ్బంది ఉండదు.

● ప్రక్రియ ఇలా...

ప్రజలకు అవసరమై సాధారణంగా ప్రభుత్వ నియంత్రణలో ఉండే సేవలైన విద్యుత్, నీరు, రవాణా, వైద్యం, టెలిఫోన్ సేవల్లో ఇబ్బందులు ఏర్పడితే ముందుగా సాధారణంగా సమస్యను సంబంధిత అధికారులకు తెలియజేయడానికి ప్రయత్నించాలి. అప్పటికీ సమస్య తీరకపోతే నేరుగా ప్లాపస్‌కి వెళ్లవచ్చు. ఒక తెల్ల కాగితంపై అర్జీ రాసి ఇవ్వాలి. ఎవరికైతే నోటీసు పంపించాలో వారి అడ్రసు స్పష్టంగా తెలియజేయాలి. ప్లాపస్ పిటిషన్ స్వీకరించిన తర్వాత ప్రత్యర్థులకు నోటీసు పంపించి రాతపూర్వక సమాధానం తీసుకుని రాజీమార్గం ద్వారా పరిష్కారానికి ప్రయత్నం చేస్తుంది. ఆ విధంగా పరిష్కారం కుదరని పక్షంలో ఇరువైపులా విచారించి తీర్పు ఇచ్చే సందర్భాల్లో సహజ న్యాయ సూత్రాలను ప్లాపస్ అనుసరిస్తుంది. సీపీసీ, ఎవిడెన్స్ యాక్టులతో సంబంధం ఉండదు. గరిష్ఠంగా 3-4 నెలల్లో పరిష్కారానికి కృషి చేస్తారు. ఈ తీర్పు (అవార్డు)పై పౌర కోర్టుల్లో అప్పీలు చేసుకోడానికి వీలుండదు.

● ఏ ఇబ్బందులకు పరిష్కారం?

రూ.కోటి విలువ కలిగిన వ్యాజ్యాలకు ప్లాపస్‌లో విచారించే అధికారం ఉంది. ప్రభుత్వ ప్రైవేటు సంస్థలు నిర్వహించే రోడ్డు, విమాన, ప్రజా, వస్తు రవాణా, పోస్టల్, ప్రైవేటు కొరియర్, బీఎస్ఎన్ఎల్, ప్రైవేటు ఫోన్ ఆపరేటర్లకు సంబంధించిన వివాదాలు.. విద్యుత్తు, తాగునీరు సరఫరా, కరెంట్ షాక్ వల్ల కలిగే ప్రమాదాలు, ప్రభుత్వ, ప్రైవేటు ఆస్పత్రుల్లోని వైద్యం, బీమా సంస్థలు, బ్యాంకులు, ప్రైవేటు ఫైనాన్సు, ప్రైవేటు, పబ్లిక్ విద్యా సంస్థలు, మహాత్మాగాంధీ గ్రామీణ ఉపాధి హామీ, ప్రజారోగ్య, పారిశుధ్య, ప్రజా సంరక్షణకు సంబంధించి సేవలు, వీధుల్లో మురుగునీటి సమస్య.. రాష్ట్ర హౌసింగ్ బోర్డు, కార్పొరేషన్, గృహ నిర్మాణ సొసైటీలు, ప్రైవేటు నిర్మాణదారులతో నిర్మాణాలకు సంబంధించిన వివాదాలకు సంబంధించి రాజీ మార్గంలో పరిష్కారానికి ప్రయత్నం చేస్తారు. ఒకవేళ రాజీ కుదరకపోతే విచారణ జరిపి తీర్పు వెలువరిస్తారు. పది పబ్లిక్ యుటిలిటీ సర్వీసెస్‌లోని సేవా లోపాలు, వివాదాలకు ఒక్కపైసా ఖర్చు లేకుండా, న్యాయవాది అవసరం లేకుండా వేగంగా పరిష్కారం లభిస్తుంది. పిటిషన్ వేయడానికి ఒక ఫార్మాట్ అంటూ ఉండదు. ప్రజలు వారికి తోచిన సరళమైన భాషలో పిటిషన్ రాయవచ్చు. ఒకవేళ రాయడం రాకపోతే జిల్లా న్యాయ సేవాధికార సంస్థ సహకరిస్తుంది.

ఇవిగో కేసులు.. పరిష్కారాలు..

● అనపర్తి మండలానికి చెందిన ఒక బాలిక పదో తరగతి ఉత్తీర్ణత సాధించింది. సర్టిఫికెట్‌లో తల్లిదండ్రుల్లోని ఓ పేరులో ఇంగ్లిషు అక్షరాల్లో తప్పుదొర్లింది. విద్యా శాఖ అధిరుల చుట్టూ తిరిగి విసిగిపోయిన ఆ బాలిక ప్లాపస్‌ని ఆశ్రయించింది. ప్లాపస్ ప్రక్రియ ప్రారంభించింది. 15 రోజుల్లో ఎస్ఎస్‌సీ బోర్డు పేరు సరిజేసి పంపిన సర్టిఫికెట్‌ను ఆ బాలిక చేతికి ప్లాపస్ అందజేసింది.

● రాజమహేంద్రవరానికి చెందిన ఓ మహిళ బ్యాంకులోను తీర్చేశారు. కానీ ఆమె హామీగా ఇచ్చిన దస్తావేజులను ఇవ్వడానికి మాత్రం బ్యాంకు అధికారులు పదేపదే తిప్పించుకున్నారు. బాధితురాలు ప్లాపస్‌ను ఆశ్రయించగా ఇరువైపులా వాదనల అనంతరం రెండు వారాల్లో ఆమెకు దస్తావేజులు ఇవ్వాలని తీర్పు చెప్పారు.

● రాజానగరానికి చెందిన ఒక వ్యక్తి తన ఇంటి పక్కన ఉన్న ఖాళీ స్థలంలో చెత్త వేస్తున్నారని, దుర్వాసన వస్తోందని, హానికరంగా ఉందని ప్లాపస్‌లో ఫిర్యాదు ఇచ్చారు. వెంటనే చెత్తను తరలించి ఆ ప్రదేశాన్ని పరిశుభ్రంగా ఉంచాలని సంబంధిత అధికారులను ప్లాపస్ ఆదేశించింది.

- వైసీపీ ఎమ్మెల్సీ అనంతబాబు డ్రైవర్ హత్య కేసులో ఎట్టకేలకు కీలక అడుగు
- పోలీసు దర్యాప్తునకు సహకరించేందుకు ప్రత్యేక న్యాయవాదిగా ముప్పాళ్ల నియామకం
- ఉత్తర్వులు జారీ చేసిన రాష్ట్ర ప్రభుత్వం
- హత్య కేసుపై మొదటి నుంచీ సుబ్రహ్మణ్యం కుటుంబం తరపున ముప్పాళ్ల పోరాటం

'అనంత' పాపాలు పండేనా?

(కాకినాడ/రాజమహేంద్రవరం సిటీ, ఆంధ్రజ్యోతి)

వైసీపీ ఎమ్మెల్సీ అనంతబాబు డ్రైవర్ వీధి సుబ్రహ్మణ్యం హత్య కేసులో కీలక పరిణామం చోటుచేసుకుంది. ఇన్నేళ్లపాటు కేసు విచారణ పూర్తిగా పక్కనపడిపోయిన నేపథ్యంలో కేసు మరింత లోతుగా విచారణ జరిగేలా ప్రభుత్వం నిర్ణయం తీసుకుంది. ఈ మేరకు పోలీసు విచారణకు సహకరించేందుకు వీలుగా రాజమహేంద్రవరానికి చెందిన సీనియర్ న్యాయవాది, మానవ హక్కుల నేత ముప్పాళ్ల సుబ్బారావును నియమించింది. హత్య కేసులో ప్రాసిక్యూషన్‌కు సహాయం చేయడానికి వీలుగా సుబ్బారావును నియమిస్తున్నట్లు హోంశాఖ గురువారం జారీ చేసిన జీవో నెం.538లో పేర్కొంది. ఈ నేపథ్యంలో ఇన్నేళ్లపాటు మూలనపడిపోయిన హత్య కేసు విచారణ ఇకపై మరింత లోతుగా జరగనుంది. ఈ హత్యకు సంబంధించి ప్రధాన నిందితుడైన వైసీపీ ఎమ్మెల్సీ అనంతబాబుపై ముప్పాళ్ల సుబ్బారావు తొలి నుంచీ పోరాటం చేస్తున్నారు. హత్య కేసు నమోదు నుంచి చార్జిషీట్ దాఖలు వరకు అప్పటి ప్రభుత్వం కేసును ఎలా నీరుగార్చేలా వ్యవహరించిందనేదానిపై ఆయన న్యాయపరంగా పోరాటం చేస్తున్నారు. డ్రైవర్ సుబ్రహ్మణ్యం కుటుంబానికి న్యాయపరంగా మూడేళ్ల నుంచి సహకరిస్తున్నారు.

ఎంత అరాచకమో....

ఎమ్మెల్సీ అనంతబాబు 2022 మే 18న రాత్రి కాకినాడలో డ్రైవర్ సుబ్రహ్మణ్యం ఇంటికి వచ్చి పని ఉందని తీసుకువెళ్లాడు. ఆ తర్వాత కాకినాడ బీచ్ రోడ్డులో దారుణంగా దాడి చేసి కొట్టి చంపాడు. మే 19 తెల్లవారుజామున మృతదేహాన్ని స్వయంగా తన కారులో డ్రైవర్ ఇంటికే తీసుకువెళ్లి రోడ్డు ప్రమాదంగా చిత్రీకరించే ప్రయత్నం చేశాడు. కుటుంబీకులు తిరగబడ్డంతో అంత్యక్రియలకు డబ్బులు ఇస్తానని, నోరు తెరవొద్దని బెదిరించాడు. ప్రభుత్వ పెద్దలకు సన్నిహితుడు కావడంతో అనంతబాబు కోసం పోలీసులు కనీసం గాలించలేదు. మీడియా ఒత్తిడితో గాలింపు ముమ్మరం చేయగా హత్య తానే చేశానని పోలీసుల ఎదుట ప్రత్యక్షమయ్యాడు. తీరా అధికార పార్టీ ఒత్తిళ్లతో పోలీసులు కేసును నీరుగార్చడం కోసం కేవలం అనుమానాస్పద హత్యగా నమోదు చేయడానికి ప్రయత్నించారు. కానీ బాధితులు, దళిత సంఘాల ఆందోళనతో చివరకు కేసును హత్యకేసుగా మార్చారు. ఆ తర్వాత అనంతబాబును అరెస్ట్ చేసి రాజమహేంద్రవరం సెంట్రల్ జైలుకు తరలించారు. పోలీసులు దాఖలు చేసిన ఛార్జిషీటులోను అనంతబాబుకు అనుకూలంగా వ్యవహరించారు. కొన్నాళ్లకు మధ్యంతర బెయిల్‌పై ప్రస్తుతం స్వేచ్ఛగా బయటే తిరుగుతున్నాడు.

ముప్పాళ్ల పోరాటం ...



కేసు దర్యాప్తును పోలీసులు పూర్తిగా నీరుగార్చేశారు. ఇదే విషయమై సీనియర్ న్యాయవాది, ఏపీ బార్ కౌన్సిల్ సభ్యుడు ముప్పాళ్ల సుబ్బారావు పోరాటం చేశారు. బెయిల్ రద్దు, విచారణ లోతుగా జరిగేలా పోరాటం చేశారు. ప్రభుత్వం మారాక కేసు విచారణ వేగంగా జరుగుతుందని భావించినా కొంత ఆలస్యం అయింది. ఇటీవల కేసుకు సంబంధించి దర్యాప్తు లోపాలు, ఇతర ఆధారాలను ముప్పాళ్ల ప్రభుత్వానికి వివరించారు. ఈ నేపథ్యంలో కేసుపై తొలి నుంచీ పోరాటం చేస్తోన్న ముప్పాళ్ల సహకారం పోలీసు లకు అవసరమని ప్రభుత్వం భావించింది. కేసు తదుపరి దర్యాప్తునకు పోలీసులకు సహకారం అందించి పురోగతి వచ్చేలా చేయడానికి ప్రభుత్వం నిర్ణయించడంతో బాధితుల్లో ఆనందం వ్యక్తమవుతోంది.





నీటి విలువ తెలుసుకో.. పొదుపుగా వాడుకో అంటుంటారు పెద్దలు.. సమయానికి చుక్క నీరు లేకపోతే ప్రాణాలే పోతాయి.. ఈ దృశ్యాలే అందుకు నిదర్శనం. భానుడు మండిపడుతున్నాడు.. ఉదయం 10 గంటలు దాటిన తరువాత బయటకు రావాలంటేనే భయపడేంతగా ప్రతాపం చూపుతున్నాడు..దీంతో 11 గంటలకే రోడ్లన్నీ కర్ఫ్యూని తలపిస్తున్నాయి.. ఎండను తట్టుకోలేక గూడు ఉన్న వారు గూటికి చేరుతుంటే గూడు లేని వారు ఆపసోపాలు పడుతున్నారు.. ఈ చిత్రంలో భిచ్చగాడిని చూశారా.. వయసు 70పైనే ఉంటుంది.. చాలా కాలంగా రాజమహేంద్రవరం కంబాలచెరువు ప్రాంతంలో ఉంటున్నాడు.. గురువారం మధ్యాహ్నం ఎండను తాళలేకపోయాడు.. ఉక్కబోతను తట్టుకోలేక ఉక్కిరిబిక్కిరి అయ్యాడు. ఎక్కడైనా నీళ్లు దొరక్కపోతాయా అని అటూ ఇటూ చూశాడు.. ఆ సమయానికి కుళాయిలు రావు.. ఎవరింటికైనా వెళ్లినా నీళ్లివ్వరు.. అంతే అటుగా వెళుతూ వాటర్ ఫౌంటైన్‌లో ఉన్న నీటిని చూశాడు.. ప్రాణం లేచివచ్చినట్టు అనిపించింది. వెంటనే ఆ నీటిని కొద్దిగా సేవించి.. వేడిగా ఉన్నా ఆ నీటితోనే ముఖం కడుక్కుని సేదతీరాడు.. ప్రభుత్వం గ్రామాల్లో పశువుల కోసం వాటర్ పాండ్‌లు కట్టేందుకు సమాయత్తమైంది..నగరాల్లోని కొన్ని ప్రాంతాల్లో వేసవిలోనైనా నిత్యం నీటి సదుపాయం ఉండే ఏర్పాట్లు చేస్తే ఇటువంటి వారికి ఇబ్బందే ఉండదు.. సర్కారు ఆ దిశగా ఆలోచించాల్సిందే.

- ఫొటోగ్రాఫర్, రాజమహేంద్రవరం

ఈదురు గాలులకు కూలిపోయిన

132 కేవీ విద్యుత్ టవర్

- సుందరపల్లి పంటపొలాల్లో ఘటన
- కోనసీమలో విద్యుత్ సరఫరాకు అంతరాయం
- టవర్ పునరుద్ధరణ పనులు పరిశీలించిన మంత్రి, ఎంపీ, ఎమ్మెల్యే

కె.గంగవరం, ఏప్రిల్ 17(ఆంధ్రజ్యోతి): ఈనెల 14న మంగళవారం మండలంలో వీచిన ఈదురుగాలులకు సుందరపల్లి గ్రామ పరిధిలోని పంట పొలాల్లో ఉన్న విద్యుత్‌శాఖకు చెందిన 132 కేవీ టవర్ కూలిపోయింది. దీనివలన కోనసీమలో విద్యుత్ సరఫరాకు తీవ్ర అంతరాయం ఏర్పడింది. బొమ్మూరు నుంచి రామచంద్రపురం అక్కడి నుంచి వయా కె.గంగవరం మండలంలోని పలు గ్రామాలను కలుపుకుంటూ గోదావరినది దాటి అంబేడ్కర్ కోనసీమ జిల్లాలోని కొత్తపేట, ముమ్మిడివరం ప్రాంతాలకు విద్యుత్ సరఫరా అవుతుంది. ఈ లైన్‌లో టవర్ కూలిపోవడంతో కోనసీమ ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా నిలిచి పోయింది. అయితే వేరే ప్రాంతాల నుంచి విద్యుత్ సరఫరా తీసుకుని కోనసీమ ప్రాంతాల్లో అరకొర సరఫరా చేశారు. దీనిపై ప్రజల్లో తీవ్ర అసంతృప్తి ఏర్పడింది. దీంతో కార్మికశాఖ మంత్రి వాసంశెట్టి సుభాష్, అమలాపురం ఎంపీ గంటి హరీష్ మాధుర్, ముమ్మిడివరం ఎమ్మెల్యే దాట్ల సుబ్బరాజు (బుచ్చిబాబు)లు ఆర్డీవో దేవర కొండ అఖిల, విద్యుత్ శాఖ డిస్కం అధికారులతో కలిసి టవర్ పునరుద్ధరణ పనులు స్వయంగా పరిశీలించారు. త్వరితగతిన టవర్ నిర్మాణం పూర్తిచేసి గురువారం రాత్రికల్లా విద్యుత్ సరఫరా పునరుద్ధరించాలని ఆదేశించారు. ట్రాన్స్‌కో సీఈ శ్యాంప్రసాద్, ఎస్ఈ గురుబాబు, ఈఈ శ్రీధర్‌రెడ్డి, ఏడీ జీవవీవీ సత్యనారాయణ, ఏఈ వెంక టేశ్వరరావులు, తహశీల్దార్ బండి మృ త్యుంజయరావు వారి వెంట ఉన్నారు.


సుందరపల్లి వద్ద పడిపోయిన విద్యుత్ టవర్


మంత్రి సుభాష్, ఎంపీ హరీష్‌లకు టవర్ పునరుద్ధరిస్తున్న పనులు వివరిస్తున్న ఆర్డీవో అఖిలప్రియ

రైతులకు నష్టపరిహారం ఇప్పిస్తాం

టవర్ పడిపోవడం వలన, టవర్ పునరుద్ధరణ సమయంలో చేతికి వచ్చిన పంట పాడైందని స్థానిక రైతులు మంత్రి సుభాష్, ఎంపీ హరీష్‌కు విన్నవించారు. దీనిపై ఆయన రైతులు ఆందోళన చెందవద్దని, నష్టపరిహారం ఇప్పిస్తామన్నారు. ఆర్డీవో డి.అఖిలప్రియతో నష్టం అంచనాలు వేయించాలని, పరిహారం అందించాలని అదేశించారు. ఈ కార్యక్రమంలో కూటమి నాయకులు సలాది రమేష్, శీరెడ్డి సత్తిబాబు, తాడాల జానకిరామ్, తదితరులు పాల్గొన్నారు.

బాణసంచా గొడౌన్‌లో పేలుడు

- పంగిడిలో ఘటన..
- తప్పిన ప్రాణాపాయం
- ప్రమాద స్థలాన్ని పరిశీలించిన జిల్లా కలెక్టర్ ప్రశాంతి

కొవ్వూరు, ఏప్రిల్ 17(ఆంధ్రజ్యోతి): కొవ్వూరు మండలం పంగిడిలోని బాణసంచా గొడౌన్‌లో పేలుడు సంభవించింది. ప్రమాద సమయం లో అక్కడ ఎవ్వరూ లేకపోవడంతో ప్రాణాపాయం తప్పింది. సమాచారం తెలుసుకున్న కొవ్వూరు అగ్నిమాపకశాఖ అధికారులు సంఘటనా స్థలానికి చేరుకుని మంటలను అదుపు చేశారు. ఈ ఘటనలో సుమారు రూ.3 లక్షల ఆస్తినష్టం జరిగినట్టు అధికారులు గుర్తించారు. సూర్యకారం, గంధకం, బొగ్గు నిలవచేసి ఉంచారు. అలాగే 150 జువ్వలు, 50 ఔట్లు, 4000 టపాకాయలు, సుమారు 15 కిలోలు తయారు చేసినవి, రా మెటీరియల్ 15 కిలోలు మొత్తం 30 కేజీల ఫైర్ మెటీరియల్ గొడౌన్‌లో ఉన్నాయి. ఒకవైపు ఎండ వేడిమి, మరో వైపు గొడౌన్ తలుపులు మూసేసి ఉండడంతో ప్రమాదం జరిగిందని అధికారులు చెబుతున్నారు. కొవ్వూరు మండ లం ఐ.పంగిడి, చాగల్లు మండలం మీనానగరం మ ధ్యలో ఉన్న నఫీజ్ బాణసంచా గొడౌన్‌లో జరిగిన అగ్ని ప్రమాద ప్రాంతాన్ని జిల్లా కలెక్టర్ పి.ప్రశాంతి పరిశీలించారు. ప్రమాద వివరాలను అధికారుల నుంచి అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ బాణసంచా తయారీ యూనిట్‌లను పరిశీలించి తగిన భద్రతా ప్రమాణాలు ఖచ్చితంగా పాటించేలా చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. జిల్లా వ్యాప్తంగా బాణాసంచా తయారీదారులు లైసెన్సుల కాలపరిమితి ముగిసిన వారిని గుర్తించి రెన్యూవల్ అనుమతులు పొందేలా చర్యలు తీసుకోవాలన్నారు. బాణసంచా భద్రపరిచే గొడౌన్‌ల వద్ద తగిన భద్రతా ప్రమాణాలు పాటిస్తున్నారో లేదో క్షేత్రస్థాయిలో పరిశీలించాలన్నారు. పంగిడిలో నసీఫ్ ఫైర్‌క్రాకర్స్‌కు ఇచ్చిన అనుమతి మార్చి 31వ తేదీతో ముగిసిందన్నారు. జిల్లా వ్యాప్తంగా బాణసంచా భద్రపరిచే గొడౌన్‌లను పోలీసు, రెవెన్యూ, ఫైర్, స్థానిక సంస్థల అధికారుల బృందం పర్యవేక్షించి లైసెన్సులు లేకపోయినా, తగిన భద్రతా ప్రమాణాలు పాటించకపోయిన తక్షణ చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. కలెక్టర్ వెంట అర్‌ఎఫ్‌వో ఈ.స్వామి, డీఎఫ్‌వో మార్టిన్ లూథర్‌కింగ్, ఆర్డీవో రాణిసుస్మిత, తహశీల్దార్ ఎం.దుర్గాప్రసాద్, రూరల్ సీఐ కె.విజయబాబు, ఫైర్ అధికారి వేణు, ఎస్ఐ కె.శ్రీహరిరావు ఉన్నారు.



కొవ్వూరు మండలం పంగిడిలో అగ్నికి ఆహుతైన బాణసంచా గొడౌన్, పరిశీలిస్తున్న జిల్లా కలెక్టర్ ప్రశాంతి




మాట్లాడుతున్న ఎస్పీ బిందుమాధవ్, విద్యార్థులకు సర్టిఫికెట్లు, బహుమతులు అందజేస్తున్న అతిథులు

క్రీడలతో మానసిక ఒత్తిడి నుంచి ఉపశమనం

- కాకినాడ జిల్లా ఎస్పీ బిందుమాధవ్

జేఎన్టీయూకే, ఏప్రిల్ 17(ఆంధ్రజ్యోతి): వృత్తి, ఆరోగ్యరీత్యా మానసిక ఒత్తిడి నుంచి ఉపశమనం పొందేందుకు క్రీడలు దోహదపడతాయని కాకినాడజిల్లా ఎస్పీ జి.బిందుమాధవ్ అన్నారు. వర్శిటీలోని అలూమ్ని ఆడిటోరియంలో గురువారం యూసీఈకే క్రీడాదినోత్సవ వేడుకలు నిర్వహించారు. ప్రిన్సిపాల్ మోహన్‌రావు అధ్యక్షుడిగా, జేఎన్టీయూకే స్పోర్ట్స్ కౌన్సిల్ కార్యదర్శి డాక్టర్ జి.శ్యామ్‌కుమార్ సమన్వయకర్తగా వ్యవహరించారు. ముఖ్యఅతిథిగా ఎస్పీ బిందుమాధవ్, గౌరవ అతిథులుగా భారత బీచ్ వాలీబాల్ జట్టు కెప్టెన్, అంతర్జాతీయ వాలీబాల్, బీచ్ వాలీబాల్ క్రీడాకారుడు ఎంసీహెచ్ఆర్ కృష్ణంరాజు, ఉపకులపతి సీఎస్ఆర్కే ప్రసాద్ పాల్గొన్నారు. ఎస్పీ మాట్లాడుతూ విద్యార్థులు పోటీ పరీక్షల్లో పాల్గొనే వారి సంఖ్యను చూసి భయపడుతున్నారన్నారు. కానీ ఉన్న ఉద్యోగాల్లో మనకు కావాల్సింది ఒక్కటేనని గుర్తుచేసుకుని విజయం సాధించాలన్నారు. కృష్ణంరాజు మాట్లాడుతూ క్రీడల్లో పాల్గొనే విద్యార్థులకు క్రెడిట్ పాయింట్స్ ఇస్తున్న వర్శిటీ జేఎన్టీయూకే ఒక్కటేనన్నారు. వీసీ ప్రసాద్ మాట్లాడుతూ క్రీడలద్వారా పట్టుదల, కార్యసిద్ధి మెరుగుపడి ఒత్తిడిని జయించవచ్చన్నారు. 2024-25 వార్షిక క్రీడా నివేదికను శ్యామ్ కుమార్ సమర్పించారు. వర్శిటీ తరపున జాతీయస్థాయి పోటీల్లో పాల్గొన్న క్రీడాకారులకు, విజేతలకు, పలు క్రీడా పోటీల్లో గెలుపొందిన విద్యార్థులకు మెమెంటోలు, బహుమతులు, ప్రతిభా పత్రాలను అతిథులు అందజేశారు. కార్యక్రమంలో రెక్టార్ కేవీ రమణ, ఇన్‌చార్జి రిజిస్ట్రార్ వి.రవీంద్రనాథ్, ఓఎస్డీ కోటేశ్వరరావు మాజీ వైస్ చాన్సలర్లు, డైరెక్టర్లు, వైస్ ప్రిన్సిపాల్స్, క్రీడాకారులు, విద్యార్థులు పాల్గొన్నారు.

10న జాతీయ లోక్ అదాలత్


సమావేశంలో మాట్లాడుతున్న పీడీజే గంధం సునీత

రాజమహేంద్రవరం, ఏప్రిల్ 17(ఆంధ్రజ్యోతి): మోటారు వాహన ప్రమాదాల కేసులను మే 10న నిర్వహించే జాతీయ లోక్‌అదాలత్‌లో పరిష్కరించాల ని ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా ప్రధాన న్యాయ మూర్తి, జిల్లా న్యాయ సేవాధికార సంస్థ చైర్‌పర్సన్ గంధం సునీత అన్నారు. వివిధ బీమా సంస్థల ప్రతినిధులతో గురువారం సమావేశమయ్యారు. పెం డింగ్‌లో ఉన్న ఆ తరహా కేసుల జాబితాను డీఎల్ ఎస్ఏకి అందజేయాలని సూచించారు. బాధితులకు తగు పరిహారం అందజేయడానికి తీసుకోవాల్సిన చర్యలపై చర్చించారు. సంస్థ కార్యదర్శి ఎన్.శ్రీలక్ష్మి మాట్లాడుతూ ముందస్తు లోక్‌అదాలత్ సమావేశాల్లో బీమా సంస్థల ప్రతినిధులు, ప్రమాద కేసుల్లోని బాధితులు, ఇరుపక్షాల న్యాయవాదులు పాల్గొనాలన్నారు. కార్యక్రమంలో జీపీసీహెచ్‌వీ ప్రసాద్ పాల్గొన్నారు.

ట్రాన్స్‌జెండర్ల పట్ల వివక్ష చూపరాదు

స్త్రీ, పురుషులతో సమానంగా ట్రాన్స్‌జెండర్లకూ హక్కులు ఉన్నాయని, వారిపట్ల వివక్ష చూపరాదని పర్మినెంట్ లోక్ అదాలత్ చైర్మన్ ఎ.గాయత్రి దేవి, జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి ఎన్.శ్రీలక్ష్మీ పేర్కొన్నారు. ట్రాన్స్‌జెండర్ల హక్కులపై గురువారం న్యాయ విజ్ఞాన సదస్సు నిర్వహించారు. ట్రాన్స్‌జెండర్ల హక్కులు, స్వయం ఉపాధి అవకాశాలపై వివరించారు. ఎలాంటి న్యాయ సహాయం అవసరమైనా డీఎల్ ఎస్ఏ తరఫున చేస్తామన్నారు. కార్యక్రమంలో డీఎస్పీ కె.రమేశ్ బాబు పాల్గొన్నారు.

సేల్స్‌టాక్స్ డిప్యూటీ కమిషనర్‌పై విచారణకు ఆదేశం

కాకినాడ సిటీ, ఏప్రిల్ 17 (ఆంధ్రజ్యోతి): కాకినాడ డివిజన్ సేల్స్‌టాక్స్ డిప్యూటీ కమిషనర్‌గా పనిచేస్తున్న ఎం.సత్య ప్రకాష్‌పై ప్రభుత్వం విచారణకు ఆదేశించింది. సీసీఎస్‌టీ డిప్యూటీ కమిషనర్ ఏబీ హర్షవర్ధన్‌ను విచారణాధికారిగా నియమించింది. సత్యప్రకాష్ అసిస్టెంట్ కమిషనర్‌గా ఉన్న సమయంలో ఒంగోలుకు చెందిన ఓ కంపెనీ డీలరుకు నిబంధనలకు విరుద్ధంగా రూ.16.50లక్షలు టాక్స్ రిఫండ్ చేశారు. లోతుగా విచారణ చేసిన ప్రభుత్వం లోపాలను గుర్తించడానికి విచారణకు ఆదే శించింది.గురువారం ఉత్తర్వులు జారీ చేసింది.

ఇద్దరు మహిళల మృతికి కారణమైన లారీ డ్రైవర్‌కు ఆరు నెలల జైలు

సామర్లకోట, ఏప్రిల్ 17 (ఆంధ్రజ్యోతి): కాకినాడజిల్లా సామర్లకోట మండలం పెద బ్రహ్మదేవం కెనాల్‌రోడ్లో లారీని అతివే గంగా నడుపుతూ రోడ్డు పక్కన నడిచి వెళుతున్న ఇద్దరు మహిళలను ఢీకొనడంతో సదరు ఇద్దరు మహిళలు మృతి చెందడానికి కారకుడైన లారీ డ్రైవర్ అనకాపల్లి జిల్లా గుట్టివాడకు చెందిన అద్దం భాస్కరరావుకు ఆరు నెలల జైలుశిక్ష, రూ.5,500 జరిమానా విధిస్తూ కాకినాడ ఐదో కోర్టు మేజిస్ట్రేట్ షేక్‌నరీన్ తీర్పునిచ్చినట్లు సామర్లకోట సీఐ కృష్ణభగవాన్ గురువారం సాయంత్రం తెలిపారు. 10 నవంబరు 2022లో జరిగిన ఈ ప్రమాదంపై అప్పటి ఎస్ఐ సునీత కేసు నమోదుచేసి దర్యాప్తు నిర్వహించారు. ప్రాసిక్యూషన్ తరపున పీపీ రఘువీర్ వాదించగా సాక్షులను కోర్టు కాని స్టేబుల్ సతీష్ ప్రవేశపెట్టగా తుది తీర్పును గురువారం ప్రకటించినట్లు సీఐ చెప్పారు.

విధుల నుంచి సెక్యూరిటీ గార్డు తొలగింపు

అన్నవరం, ఏప్రిల్ 17(ఆంధ్రజ్యోతి): అన్నవరం కొండపై పార్కింగ్ ఏరియాలో విధుల్లో ఉన్న ప్రైవేట్ సెక్యూరిటీ గార్డు బహిరంగంగా ధూమపానం చేయడం విధితమే. ఆ వీడియోలు సామాజిక మాధ్యమాల్లో రావడంతో భద్రతా అధికారులు స్పందించి అతనిని విధుల నుంచి తప్పించాలని సంబంధిత సెక్యూరిటీ ఏజెన్సీకి తెలపడంతో వారు అతడిని తొలగించారు.

తునిలో యువకుడి అనుమానాస్పద మృతి

తునిరూరల్, ఏప్రిల్ 17(ఆంధ్రజ్యోతి): కాకినాడ జిల్లా తుని పట్టణం ఎమ్మార్‌పేటలో యువకుడు అనుమానాస్పదంగా మృతి చెందడం సంచలనం రేకెత్తించింది. అనకాపల్లి జిల్లా రాంపల్లి మండలం సీతపాలెం గ్రామానికి చెందిన రుత్తుల లీలామాధవ్(23) కొద్దికాలంగా కేశవరంలోని ఓ ప్రైవేట్ ఫ్యాక్టరీలో ఉద్యోగంలో చేరి విధులు నిర్వహిస్తున్నాడు. ఇటీవల తుని పట్టణం ఎమ్మార్‌పేటలో అద్దెకి దిగిన ఆ యువకుడు అదే ఇంట్లో అనుమానాస్పదంగా మృతి చెందాడు. సాయంత్రం అయినా గది తలుపులు తెరవకపోవడంతో ఇంటి యజమాని పరిశీలించగా లీలామదన్ ఫ్యాన్‌కు ఉరి వేసుకుని మృతి చెంది ఉండడాన్ని గమనించాడు. విషయాన్ని పట్టణ పోలీసులకు సమాచారం ఇవ్వడంతో సంఘటనా స్థలానికి సీఐ గీతారామకృష్ణ, ఎస్ఐలు చేరుకుని పరిశీలించారు. పోలీసుల సమాచారంతో మృతుడి తల్లిదండ్రులు అక్కడకు చేరుకుని కన్నీరుమున్నీరుగా విలపించారు. తమ కుమారుడు ఒక అమ్మాయితో ప్రేమలో ఉన్నాడని, పలుమార్లు హెచ్చరించినా పెడచెవిన పెట్టాడని, ఈ కారణంగానే తమ కొడుకు ఆత్మహత్యకు పాల్పడి ఉంటాడని మృతుడి తల్లిదండ్రులు తెలిపారు. శవ పంచనామాలు నిమిత్తం మృతదేహాన్ని ఏరియా ఆసుపత్రికి తరలించారు.


ఎంఆర్‌పేటలో అనుమానాస్పదంగా మృతి చెందిన యువకుడు

రైలులో నేరాలకు పాల్పడుతున్న వ్యక్తి అరెస్ట్

- బంగారం, నగదు, సెల్‌ఫోన్లు స్వాధీనం


పట్టుబడిన సొత్తుతో రైల్వే పోలీసులు

తునిరూరల్, ఫిబ్రవరి 17(ఆంధ్రజ్యోతి): తుని రైల్వేపోలీస్‌స్టేషన్ పరిధిలో రైళ్లలోను, రైలుకోసం వేచి చూస్తున్న ప్రయాణికులవద్ద బంగారు ఆభరణాలు, సెల్‌ఫోన్లు, నగదు దొంగిలిస్తున్న వ్యక్తిని పోలీసులు అరెస్టు చేశారు. రాజమండ్రి రైల్వే డీఎస్పీ జయరాం ప్రసాద్ ఆదేశాల మేరకు ముమ్మర తనిఖీలు చేపట్టి అనుమానాస్పద వ్యక్తిని అదుపులోకి తీసుకున్నారు. రేగుపాలేనికి చెందిన షేక్ యాసిన్‌బాబా అనే వ్యక్తిని తుని రైల్వేస్టేషన్ ప్లాట్‌ఫామ్‌పై పట్టుకుని ఆరా తీయగా ఆయన వద్ద రెండు గ్రాముల బంగారం, రెండు సెల్‌ఫోన్‌లను స్వాధీనం చేసుకుని అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించినట్లు తుని రైల్వే ఎస్ఐ జి.శ్రీనివాసరావు తెలిపారు.

ఉన్నతమైన ఆలోచనలు జీవితాన్ని మారుస్తాయి

- కాకినాడ జిల్లా కలెక్టర్ షాన్‌మోహన్
- యూసీఈకే వార్షికోత్సవ వేడుకలు



వార్షికోత్సవంలో మాట్లాడుతున్న కలెక్టర్ షాన్‌మోహన్

జేఎన్టీయూకే, ఏప్రిల్ 17 (ఆంధ్రజ్యోతి): ఉన్నతమైన ఆలోచనలు జీ వితాన్ని మారుస్తాయని కాకినాడజిల్లా కలెక్టర్ షాన్‌మోహన్ అన్నారు. వర్శిటీలోని అలూమ్ని ఆడిటోరియంలో యూసీఈకే వార్షికోత్సవ వేడుకలను గురువారం సాయంత్రం నిర్వహించారు. ముఖ్య అతిథిగా హాజరైన కలెక్టర్ మాట్లాడుతూ కళాశాలలో విద్యనభ్యసించడం ప్రతిఒక్కరి జీవితంలో ఒక మధురమైన జ్ఞాపకమన్నారు. గౌరవఅతిథి, వీసీ సీఎస్ఆర్కే ప్రసాద్ మాట్లాడుతూ విద్యను కేవలం మార్కులతోనే సరిపెట్టకూడదని, విద్యద్వారా నైతిక విలువలు పెంపొందించుకోవాలన్నారు. అనంతరం అకడమిక్, ఎండోమెంట్ అవార్డులు సాధించిన విద్యార్థులను, వారి తల్లిదండ్రులను అభినందించారు. ఉత్తమ ప్రతిభ కనబరిచిన వారికి అతిథులు సర్టిఫికెట్లు అందజేశారు. విద్యార్థుల సాంస్కృతిక ప్రదర్శనలు ఆకట్టుకున్నాయి. ప్రిన్సిపాల్ మోహన్‌రావు, వైస్ ప్రిన్సిపాల్స్, విద్యార్థులు పాల్గొన్నారు.

పోలీసు అని బురిడీ కొట్టిస్తున్న వ్యక్తి ఆచూకీ తెలపండి

ప్రత్తిపాడు, ఏప్రిల్ 17(ఆంధ్రజ్యోతి): పోలీసు అని చెప్పి ప్రజలను బెదిరించి అమాయకులవద్ద డబ్బులు కాజేస్తున్న వ్యక్తి ఆచూకీ తెలపాలని ప్రత్తిపాడు సీఐ బి.సూర్యఅప్పారావు కోరారు. నిందితుడి వాహనంతో ఉన్న ఫొటో వివరాలను గురువారం విలేఖరులకు తెలిపారు. ఉమ్మడి తూర్పుగోదావరిజిల్లాలో నిందితుడు మారుతి వెలోసో డెల్టా కారు నెంబరు ఏపీ16 ఎఫ్‌డీ 3060 నీలి రంగు వాహనంలో పోలీసు బోర్డు పెట్టుకుని కలియ తిరుగుతూ ప్రజలను మోసగించి డబ్బులు గుంజుతున్నాడని తెలిపారు. ఇతడి ఆచూకీని రాజమహేంద్రవరం టూటౌన్ సీఐ 9440796576 నెంబర్‌కు సమాచారం అందించాలని కోరారు.


ఆచూకీ తెలపాలంటూ పోలీసులు విడుదల చేసిన నిందితుడు

మోతుగూడెం బాలుడికి గిన్నిస్ బుక్‌లో చోటు

మోతుగూడెం, ఏప్రిల్17 (ఆంధ్రజ్యోతి): అల్లూరి జిల్లా చింతూరు మండలం మోతుగూడెం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 8వ తరగతి చదువుతున్న వేముల ఇజ్రాయిల్ గిన్నిస్ బుక్ ఆఫ్ వరల్డ్ రికార్డ్స్‌లో స్థానం సంపాదించాడు. 2024 డిసెంబరు ఒకటిన ఆన్‌లైన్ ద్వారా నిర్వహించిన సంగీత కచేరీలో ఇజ్రాయిల్ పాల్గొన్నాడు. కీబోర్డు ద్వారా ఒకేసారి 18 దేశాలకు చెందిన 1050 మంది వాయిద్యకారులతో కలిసి పాల్గొని గంట వ్యవధిలో ఈ ప్రక్రియ పూర్తి చేశాడు. హైదరాబాద్‌లో నిర్వాహకులు ఈ ధ్రువ పత్రం అందజేశారు. ఇజ్రాయిల్ పొల్లూరు గ్రామంలోని చర్చిపాస్టర్ వేముల అబ్రహం, సత్యశీల కుమారుడు. మోతుగూడెం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయుడు సోంస న్, ఉపాధ్యాయులు పాఠశాలలో ప్రత్యేకంగా ఏర్పాటుచేసిన సమావేశంలో ఈ విద్యార్థిని అభినందించారు. గిన్నిస్ బుక్‌లో పొల్లూరు బాలుడికి చోటు దక్కింది. ఈ బాలుడికి సీలేరు కాంప్లెక్స్ చీఫ్ ఇంజనీర్ వాసుదేవరావు ప్లాంట్ మేనేజర్ భీమవరపు బాలకృష్ణ సీనియర్ ఎకౌంటు ఆఫీసర్ వరప్రసాద్, మోతుగూడెం ఇన్‌చార్జ్ ఎస్ఐ శివకుమార్, పంచాయతీ సెక్రటరీ జి.మోహన్, సర్పంచ్ ఆకేటి సీత, ఎంపీటీసీ వేగి నాగేశ్వరరావు, డీఏవీ పాఠశాల ప్రధానోపాధ్యాయుడు మల్లె రఘురాం బాలుడికి అభినందనలు తెలిపారు.


ఇజ్రాయిల్‌కి గిన్నిస్ బుక్ అవార్డు అందజేస్తున్న దృశ్యం

రాష్ట్రంలో పేదలందరికీ ఇళ్ల స్థలాలు ఇవ్వాలి

- సీపీఐ రాష్ట్ర కార్యదర్శి రామకృష్ణ

రాజమహేంద్రవరం అర్బన్, ఏప్రిల్ 17 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రవ్యాప్తంగా ఇళ్లు లేని పేదలకు ఇంటి స్థలాల కోసం ఎనిమిది నెలలుగా ఆందోళనలు చేస్తున్నా ప్రభుత్వం పట్టించుకోకపోవడం దారుణమని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కె.రామకృష్ణ అన్నారు. గురువారం సీపీఐ జిల్లా సమితి నాయకత్వంలో ఇంటి స్థలం కోసం పేదల గోడు పేరుతో రాజమహేంద్రవరంలోని ఆవ ప్రాంతంలో నిర్వహించిన కార్యక్రమంలో రామకృష్ణ పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఇళ్ల స్థలాల కోసం వచ్చిన వారినుద్దేశించి ఆయన మాట్లాడారు. అనంతరం మీడియాతో మాట్లాడుతూ ప్రభుత్వ భూములను పేదలకు ఇళ్ల స్థలాల కోసం పంచాలన్నారు. ఎన్నికల ముందు ప్రతిపక్ష నేతగా చంద్రబాబు ఇచ్చిన హామీ నిలబెట్టుకోవాలని ఆయన డిమాండ్ చేశారు. రాజమహేంద్రవరంలోని ఆవ ప్రాంతంలో 22 ఎకరాల ప్రభుత్వ భూమిని కబ్జా చేసే ప్రయత్నాలు జరుగుతున్నాయని తెలుస్తోందని, ఈ భూమిని పేదలకు ఇళ్ల స్థలాలుగా ఇవ్వాలన్నారు. అర్హులైన పేదలకు ఇళ్ల స్థలాలు వచ్చే వరకూ తమ పోరాటం ఆగదని స్పష్టం చేశారు. కాగా, అంతకుముందు రాష్ట్ర కార్యదర్శి కె.రామకృష్ణ, జాతీయ కార్యవర్గ సభ్యురాలు అక్కినేని వనజ, జిల్లా కార్యదర్శి తాటిపాక మధు తదితరులు ఆవ ప్రాంతం నుంచి ప్రదర్శనగా ఇళ్లస్థలాల అర్జీదారులతో కలసి ఆధునిక మేకల కబేళా పక్కనున్న ప్రభుత్వ స్థలానికి చేరుకున్నారు. అక్కడ ఎర్రజెండా పాతి కొబ్బరికాయ కొట్టి ఈ స్థలాన్ని పేదలకు ఇవ్వాలని నినాదాలు చేశారు. కార్యక్రమంలో డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా కార్యదర్శి కె.సత్తిబాబు, జట్ల సంఘం అధ్యక్షుడు రాంబాబు, నగర కార్యదర్శి కొండలరావు, సప్పరమణ, లావణ్య, ఇతర నాయకులు, ఆవ, పరిసర ప్రాంతాలకు చెందిన అర్జీదారులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.



ప్రదర్శనలో పాల్గొన్న సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కె.రామకృష్ణ, అక్కినేని వనజ, తదితరులు

ప్రమాదాల నివారణపై అవగాహన ఉండాలి

అమలాపురంరూరల్, ఏప్రిల్ 17(ఆంధ్రజ్యోతి): అగ్నిప్రమాదాల నివారణకు ప్రతీ ఒక్కరూ అవగాహన కలిగి ఉండాలని అమలాపురం అగ్నిమాపక అధికారి కేవీ మురళీకొండబాబు అన్నారు. కామనగరువు ఆదిత్య పాఠశాలలో ప్రిన్సిపాల్ రామ్‌ప్రసాద్, వైస్ ప్రిన్సిపాల్ లక్ష్మీసుధ ఆధ్వర్యంలో అగ్నిప్రమాదాల నివారణపై సదస్సు నిర్వహించారు.

గురుకుల పాఠశాల సందర్శన

ముమ్మిడివరం, ఏప్రిల్ 17(ఆంధ్రజ్యోతి): ముమ్మిడివరం బాలికల గురుకుల పాఠశాలను సీపీఎం కేవీపీఎస్ నాయకులు గురువారం సదర్శించారు. పాఠశాలను, పరిసర ప్రాంతాలను వారు పరిశీలించి విద్యార్థినుల సమస్యలు అడిగి తెలుసుకున్నారు. సీపీఎం నాయకులు పాము బాలయ్య, డొమ్మేటి వీరరాఘవులు తదితరులు పాల్గొన్నారు.

మహిళా సాధికారతకు రాష్ట్ర ప్రభుత్వం కృషి

ఎమ్మెల్యే గిడ్డి సత్యనారాయణ



అయినవిల్లి: తొత్తరమూడిలో ఉచిత కుట్టుశిక్షణ కార్యక్రమంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే గిడ్డి

అయినవిల్లి, ఏప్రిల్ 17(ఆంధ్రజ్యోతి): మహిళా సాధికారతకు కూటమి ప్రభుత్వం కృషి చేస్తుందని పి.గన్నవరం ఎమ్మెల్యే గిడ్డి సత్యనారాయణ అన్నారు. గురువారం తొత్తరమూడిలో మండల మహిళా సమాఖ్య ఆధ్వర్యంలో మహిళలకు ఉచిత కుట్టు శిక్షణ కార్యక్రమాన్ని ఆయన ప్రారంభించారు. ఈసందర్భంగా జరిగిన సమావేశానికి సర్పంచ్ వారా జయసావిత్రి అధ్యక్షత వహించగా ఎమ్మెల్యే ప్రసంగించారు. ప్రజా సంక్షేమం, అభివృద్ధి, పెన్షన్ల పెంపు, ఉచిత గ్యాస్ సిలిండర్లు, ఎన్నికల హామీలను రాష్ట్ర ప్రభుత్వం నెరవేర్చిందన్నారు. నియోజకవర్గంలో రూ.12కోట్లతో రోడ్లు నిర్మించామన్నారు. సమావేశంలో మద్దాల సుబ్బారావు, టీడీపీ మండల అధ్యక్షుడు చిట్టూరి శ్రీనివాస్, సలాది బుచ్చిరాజు, బీజేపీ నియోజకవర్గ కన్వీనర్ చీకురుమిల్లి వెంకటేశ్వరరావు, క్షత్రియ కార్పొరేషన్ డైరెక్టర్ దెందుకూరి సత్యనారాయణరాజు, డీసీ కాకర శ్రీనివాస్, ఎంపీఎం వెంకటేశ్వరరావు, ఎంపీడీవో జి.భీమారావు, మేడిద దుర్గాప్రసాద్, వారా లక్ష్మీనరసింహరామ్, పంచాయతీ విస్తరణాధికారి వాణి బెహరా తదితరులు పాల్గొన్నారు.

75రోజులు హాజరు తప్పనిసరి

పి.గన్నవరం, ఏప్రిల్ 17(ఆంధ్రజ్యోతి): కుట్టు శిక్షణలో 75రోజులు హాజరు తప్పనిసరిగా ఉండాలని, వారికే కుట్టుమిషన్ అందిస్తామని ఎమ్మెల్యే గిడ్డి సత్యనారాయణ తెలిపారు. పి.గన్నవరం స్త్రీశక్తి భవనంలో ఏర్పాటుచేసిన కుట్టు శిక్షణా కార్యక్రమాన్ని ఆయన ప్రారంభించారు. అనంతరం కుట్టు శిక్షణా కార్యక్రమాన్ని స్థానిక కూటమి నాయకులతో కలిసి ప్రారంభించారు. ఎంపీపీ గనిశెట్టి నాగలక్ష్మి, ఎంపీడీవో కేవీ ప్రసాద్, సర్పంచ్‌లు బొండాడ నాగమణి, వడలి కొండయ్య, వైస్ ఎంపీపీ పప్పుల సాయిబాబు, బీసీ కార్పొరేషన్ ఏఈవో పి.సుబ్రహ్మణ్యం, ఏపీఎం మురళీకృష్ణ, ఎంపీటీసీలు పులపర్తి చినవెంకటలక్ష్మి, పులపర్తి రాజారావు, ఆదిమూలం సూరయ్యకాపు, నీటి సంఘం డిస్ట్రిబ్యూటరీ ఉపాధ్యక్షుడు చొల్లంగి సత్యనారాయణమూర్తి, సాధనాల శ్రీవెంకటసత్యనారాయణ, నక్కా సత్యనారాయణ, శేరు శ్రీనుబాబు, తాటికాయల శ్రీనివాసరావు, యడ్ల ఏసు పాల్గొన్నారు.

మహిళల ఆర్థిక స్వావలంబనే లక్ష్యం

మామిడికుదురు, ఏప్రిల్ 17 (ఆంధ్రజ్యోతి): మహిళల ఆర్థిక స్వావలంబనే రాష్ట్ర ప్రభుత్వ లక్ష్యమని పి.గన్నవరం ఎమ్మెల్యే గిడ్డి సత్యనారాయణ పేర్కొన్నారు. పాశర్లపూడిలోని శ్రీపాశర్లపూడి సత్రంలో ఏర్పాటుచేసిన మహిళల ఉచిత కుట్టు శిక్షణ కేంద్రాన్ని ఎమ్మెల్యే గురువారం ప్రారంభించారు. ఎంపీపీ కుసుమ వనజాకుమారి, సర్పంచ్ కొనుకు ప్రేమజ్యోతి నాగరాజు, ఎంపీటీసీ కొమ్ముల జంగమయ్య, నాయకులు శిరిగినీడి వెంకటేశ్వరరావు, చుట్టుగుళ్ల కిశోర్, కొమ్ముల కొండలరావు, గుబ్బల పండు, తుండూరి బుజ్జి, ఎంపీడీవో కె.వెంకటేశ్వరరావు పాల్గొన్నారు.

ఈదరపల్లి వంతెన నిర్మాణానికి మేలో శంకుస్థాపన

రోడ్డుకు ఇరువైపులా ఆక్రమణల తొలగింపు



ఆక్రమణల తొలగింపును పరిశీలిస్తున్న తహశీల్దార్ అశోక్‌ప్రసాద్

అమలాపురం రూరల్, ఏప్రిల్ 17 (ఆంధ్రజ్యోతి): జిల్లా కేంద్రమైన అమలాపురం పట్టణంలో ట్రాఫిక్ సమస్యను పూర్తిస్థాయిలో అధిగమించేందుకు ఎమ్మెల్యే అయితాబత్తుల ఆనందరావు ప్రత్యేక శ్రద్ధ తీసుకున్నారు. దీనిలో భాగంగా ప్రస్తుత వేసవి సీజన్‌లో బెండా కెనాల్‌పై రెండు వంతెనల నిర్మాణానికి చర్యలు చేపట్టారు. ఈనెల౩న కలెక్టర్ ఆర్.మహేష్‌కుమార్, ఎస్పీ బి.కృష్ణారావు, ఆర్డీవో కె.మాధవిలతో కలిసి ఆనందరావు రోడ్డు ఆక్రమణలను పరిశీలించి కిందిస్థాయి అధికారులకు పలు సూచనలు చేశారు. ఈదరపల్లి వంతెన వద్ద ఉదయం నుంచి రాత్రి వరకు తరచూ ట్రాఫిక్ స్తంభించిపోయి వాహనదారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఈనేపథ్యంలో రోడ్డుకు ఇరువైపులా ఉన్న ఆక్రమణలను తొలగించేందుకు ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు అమలాపురం తహశీల్దార్ పలివెల అశోక్‌ప్రసాద్ సిబ్బందితో కలిసి గురువారం ఉదయం 6 గంటల నుంచి ఆక్రమణల తొలగింపు కార్యక్రమం చేపట్టారు. 20రోజుల ముందుగానే ఆక్రమణలు తొలగించాలని సూచించినప్పటికీ పలువురు పట్టించుకోలేదు. దాంతో ఈదరపల్లి నుంచి అంబాజీపేట వెళ్లే ఏజీ రోడ్డును ఆనుకుని రోడ్డుకు ఇరువైపులా నిర్మించిన గృహాలు, భవనాలు, షాపులను పూర్తిగా తొలగించి వేశారు. దాంతో రోడ్డు విశాలంగా మారింది. ఆక్రమణల తొలగింపు కార్యక్రమంలో రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ సాధనాల యెల్లేశ్వరరావు, సర్వేయర్ శివ, వీఆర్వోలు అంకెం రాజేష్, వినోద్, వాసు తదితరులు పాల్గొన్నారు. మే నెలలో నూతన వంతెన నిర్మాణానికి శంకుస్థాపన చేయనున్నట్టు ఎమ్మెల్యే అయితాబత్తుల ఆనందరావు తెలిపారు.

నెలాఖరు వరకు నీరివ్వాల్సిందే

- మా నీరు మురుగుకాల్వకు పంపారు
- కలెక్టర్, డీఆర్వోలను కలిసి పరిస్థితిని వివరించిన రైతులు



డీఆర్వోకు వినతిపత్రం సమర్పిస్తున్న రైతులు

ఉప్పలగుప్తం, ఏప్రిల్ 17(ఆంధ్రజ్యోతి): వంతుల విధానంలో తమకు రావలసిన నీటిని అధికారులు మురుగుకాల్వకు పంపించి తమకు అన్యాయం చేశారంటూ అమలాపురం ఇరిగేషన్ సెక్షన్ పరిధిలోని రైతులు గురువారం జిల్లా కలెక్టర్‌ను కలిసి తమ గోడు విన్నవించుకున్నారు. ఈనెల10న వంతు ప్రకారం తమకు పంపవలసిన నీటిని చల్లపల్లి వియర్ ద్వారా మురుగుకాల్వలోకి పంపడంతో గ్రామంలోని మంచినీటి చెరువులకు, పొలాలకు, చేపల చెరువులకు నీరు పెట్టుకోలేక పోయామని ఆవేదన వ్యక్తం చేశారు. ఎగువ ఆయకట్టులో ఒకరి ప్రయోజనం కోసం అధికారులు 9000వేల ఎకరాల చేపల చెరువులకు అన్యాయం చేశారని వివరించారు. తగిన మట్టంలో చెరువుల్లో నీరు లేక అధిక ఉష్ణోగ్రతలకు చేపలు చనిపోతున్నాయని వాపోయారు. చల్లపల్లి, ఎస్.యానాం పంచాయతీ చెరువులు, చేపల చెరువులకు నీరందించేందుకు ఈనెలాఖరు వరకు కాల్వకు నీటి సరఫరా చెయ్యాలని కోరారు. ఉప్పలగుప్తం నీటి పంపిణీ సంఘం ఛైర్మన్ దంగేటి చిట్టిబాబు ఆధ్వర్యంలో కలెక్టర్‌కు, అనంతరం డీఆర్వోకు వినతిపత్రాలు సమర్పించారు. కార్యక్రమంలో చల్లపల్లి నీటి సంఘం ఉపాధ్యక్షుడు సుంకర రాంబాబు, సర్పంచ్‌లు ఇసుకపట్ల జయమణీరమబాబు, జోగి రాజేశ్వరీరాజా, రైతు నాయకులు పోలిశెట్టి శివాజీ, యరగర్త వెంకటేశ్వరరావు, దంగేటి బాబులు, గొలకోటి చిన్నా, పలచోళ్ళ బుజ్జి, అయితాబత్తుల రాజశేఖర్, పినిశెట్టి నరసింహారావు, ఉలిశెట్టి దొరబాబు, నిమ్మకాయల లక్ష్మణపేరయ్యనాయుడు, చవటపల్లి అప్పారావు తదితరులు పాల్గొన్నారు.

22న లేగదూడల అందాల పోటీలు



లేగదూడను పరిశీలిస్తున్న జిల్లా పశువైద్యాధికారి డాక్టర్ వెంకట్రావు

అమలాపురం రూరల్, ఏప్రిల్ 17(ఆంధ్రజ్యోతి): పాడి రైతులను ప్రోత్సహించేందుకు మండలాల వారీగా లేగదూడల అందాల పోటీలు నిర్వహిస్తున్నట్టు అమలాపురం పశుసంవర్థక శాఖ సహాయ సంచాలకుడు డాక్టర్ ఎల్.విజయారెడ్డి తెలిపారు. ఈనెల22న వన్నెచింతలపూడి పశువైద్యశాఖల వద్ద మండలస్థాయిలో లేగదూడల అందాల పోటీలు నిర్వహిస్తున్నామన్నారు. ఇప్పటికే అల్లవరం, పి.గన్నవరం మండలాల్లో ఈపోటీలు నిర్వహించామన్నారు. వన్నెచింతలపూడి పశువైద్యాధికారి డాక్టర్ పూర్ణిమానాగలక్ష్మి ఆధ్వర్యంలో ఈపోటీలను నిర్వహిస్తారు. నెల నుంచి ఏడాదిలోపు ఉన్న లేగదూడలను అందాల పోటీల్లో అనుమతిస్తామన్నారు. జిల్లా పశువైద్యాధికారి డాక్టర్ కె.వెంకట్రావు, డిప్యూటీ డైరెక్టర్ డాక్టర్ కర్నీడి మూర్తి పర్యవేక్షణలో జరిగే ఈ పోటీలకు ఎమ్మెల్యే అయితాబత్తుల ఆనందరావు, ఎంపీ గంటి హరీష్‌మాధుర్ హాజరవుతారు. గతంలో పాడి రైతు మూడేళ్ళ కాలపరిమితికి ఒక్కో పశువుకు రూ.400 ప్రీమియం చెల్లిస్తే ప్రభుత్వం బీమా రూ.1520 చెల్లించేది. రూ.30వేలు బీమా వర్తింప చేసేందుకు కూటమి ప్రభుత్వం రైతులను ప్రోత్సహించేలా ఒక్కో రైతు ప్రీమియం కింద రూ.288 చెల్లిస్తే ప్రభుత్వం రూ.1632 చెల్లిస్తుందన్నారు.

నేడు చేపల బోట్ల ఎన్యూమరేషన్

కాట్రేనికోన, ఏప్రిల్ 17(ఆంధ్రజ్యోతి): చేపల వేట నిషేధ భృతికి అర్హులైన లబ్ధిదారులను గుర్తించేందుకు ఈనెల18న ఒక్క రోజు మాత్రమే ఎన్యూమరేషన్ నిర్వహించనున్నట్టు ఎఫ్‌డీవో సీహెచ్ గోపాలకృష్ణ తెలిపారు. బోట్ యజమాని, కళాశీలు దరఖాస్తుతో పాటు బోట్ రిజిస్ట్రేషన్ కాపీ, లైసెన్స్ కాపీ, ఆధార్ కార్డు, రేషన్‌కార్డు, బ్యాంకు పాస్‌బుక్ తీసుకురావాలన్నారు. మండలంలోని 834బోట్లకు ఎన్యూమరేషన్ జరుగుతుందన్నారు. ఉదయం 8 నుంచి సాయంత్రం 6గంటల వరకు ఈకార్యక్రమం జరుగుతుందన్నారు.

సీహెచ్‌వోల న్యాయమైన డిమాండ్లు పరిష్కరించాలి



మామిడికుదురు: నగరం పీహెచ్‌సీ ఎదుట నిరసన తెలియచేస్తున్న సీహెచ్‌వోలు

మామిడికుదురు, ఏప్రిల్ 17 (ఆంధ్రజ్యోతి): వైద్య ఆరోగ్యశాఖలో సీహెచ్‌వోలుగా విధులు నిర్వహిస్తున్న తమ న్యాయమైన డిమాండ్లు పరిష్కరించాలంటూ వారు గురువారం పీహెచ్‌సీ ఎదుట నిరసన చేపట్టారు. లూటుకుర్రు పీహెచ్‌సీ ఎదుట ప్లకార్డులు పట్టుకుని డిమాండ్లు పరిష్కరించాలని నినాదాలు చేశారు. ఇంక్రిమెంట్ పాలసీ, లాయర్టీ బోనస్ వర్తింపచేయాలని శాంతియుతంగా నిరసన ప్రదర్శన చేశారు. కార్యక్రమంలో రెండు పీహెచ్‌సీల పరిధిలోని సీహెచ్‌వోలు పాల్గొన్నారు.

వేతన సవరణ చేయాలి

ముమ్మిడివరం, ఏప్రిల్ 17(ఆంధ్రజ్యోతి): పీహెచ్‌సీలో పనిచేస్తున్న కమ్యూనిటీహెల్త్ ఆఫీసర్లకు ఉద్యోగ భద్రత కల్పించాలని డిమాండ్ చేస్తూ వారంతా కొత్తలంక పీహెచ్‌సీ వద్ద ధర్నా, నిరసన చేపట్టారు. ఎన్‌హెచ్‌ఎం ఉద్యోగులతో సమానంగా 23శాతం వేతన సవరణ చేయాలని, ఈపీఎఫ్ చెల్లించాలని, ఆరోగ్య కేంద్రం అద్దె, కరెంటు బిల్లులు, ప్రతీనెలా రావాల్సిన ప్రోత్సహకాలు చెల్లించాలని వారు డిమాండ్ చేశారు. ఎలక్ట్రికల్ బిల్లులు వెంటనే చెల్లించాలని నినాదాలు చేశారు. న్యాయమైన కోర్కెలను వెంటనే పరిష్కరించాలని కోరుతూ వినతి పత్రాన్ని మెడికల్ ఆఫీసర్‌కు అందించారు.

డిమాండ్లు నెరవేర్చాలి

అల్లవరం, ఏప్రిల్ 17 (ఆంధ్రజ్యోతి): ఏళ్ల తరబడి వైద్యసేవలు అందిస్తున్న తమకు ఉద్యోగ భద్రత కల్పించి తమ పోస్టులు రెగ్యులర్ చేయాలంటూ గోడిలంక, బెండమూర్లంక పీహెచ్‌సీల వద్ద వైద్య సిబ్బంది ప్లకార్డులతో నిరసన ప్రదర్శన చేపట్టారు. బి.రాజు, ఎ.అమల, సీహెచ్ దుర్గాజ్యోతి, బి.పద్మ, మేరీ, కె.శృతి తదితరులు నిరసన ప్రదర్శనలో పాల్గొన్నారు.

ఉద్యోగ భద్రత కల్పించాలి

అంతర్వేది, ఏప్రిల్ 17 (ఆంధ్రజ్యోతి): సఖినేటిపల్లి ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో పనిచేస్తున్న కమ్యూనిటీ హెల్త్ ఉద్యోగులు గురువారం నిరసన చేపట్టారు. ఎన్‌హెచ్‌ఎం ఉద్యోగులతో సమానంగా 23శాతంసవరణ జరగాలని, ఈపీఎఫ్ పునరుద్ధరించాలని, ఆరోగ్య కేంద్రం అద్దె, విద్యుత్ బిల్లులు చెల్లించి వాటిని క్రమబద్ధీకరించాలని డిమాండ్ చేశారు. ప్రతీనెల రావాల్సిన ప్రోత్సాహకాలు ఇవ్వడంలేదన్నారు.

వైద్యుల నిరసన

మలికిపురం, ఏప్రిల్ 17 (ఆంధ్రజ్యోతి): లక్కవరం పీహెచ్‌సీలో సీహెచ్‌వోలుగా పనిచేస్తున్న వారిని క్రమబద్ధీకరించాలని కోరుతూ గురువారం పీహెచ్‌సీ ఆవరణలో వైద్యులు శాంతియుత నిరసన జరిపారు. ఆరేళ్లుగా ఆయుష్మాన్ ఆరోగ్య మందిర్‌లో ప్రధాన భూమిక పోషిస్తున్న సీహెచ్‌వోలను క్రమబద్ధీకరించాలని కోరారు. మెడికల్ ఆఫీసర్లు డాక్టర్ పావని, డాక్టర్ భావన, పి.మమతాజ్యోతి, బి.నాగేశ్వరరావు, చంటి, లలిత, మరియమ్మ పాల్గొన్నారు.

సారా విక్రయిస్తున్న వ్యక్తి అరెస్టు

అమలాపురం రూరల్, ఏప్రిల్ 17(ఆంధ్రజ్యోతి): ఎక్సైజ్ సూపరింటెండెంట్ ఎస్కేడీవీ ప్రసాద్ ఆదేశాల మేరకు అసిస్టెంట్ సూపరింటెండెంట్ జి.అమర్‌బాబు ఆధ్వర్యంలో ప్రత్యేక బృందం అమలాపురం మండలంలో దాడులు నిర్వహించారు. కామనగరువులో సారా విక్రయిస్తున్న కామన రామకృష్ణను అరెస్టుచేసి కోర్టులో హాజరుపర్చినట్టు ప్రొహిబిషన్ అండ్ఎక్సైజ్ ఇన్‌స్పెక్టర్ వీటీవీవీ సత్యనారాయణ గురువారం తెలిపారు. అయినవిల్లి మండలం విలస గ్రామానికి చెందిన రాయి రాజేష్ యానాం నుంచి మద్యాన్ని తీసుకుచ్చి విక్రయిస్తుండగా అదుపులోకి తీసుకుని అయినవిల్లి తహశీల్దార్ కోర్టులో హాజరుపరిచామన్నారు.

యానాంలో కేన్సర్ రీసెర్చ్ ఇనిస్టిట్యూట్‌ను ఏర్పాటు చేయండి



యానాం, ఏప్రిల్ 17(ఆంధ్రజ్యోతి): యానాంలో కేన్సర్ రీసెర్చ్ ఇనిస్టిట్యూట్‌ను ఏర్పాటు చేయాలని కేంద్ర మంత్రిని పుదుచ్చేరి ప్రభుత్వ ఢిల్లీ ప్రత్యేక ప్రతినిధి మల్లాడి కృష్ణారావు కోరారు. ఢిల్లీ వెళ్లిన మల్లాడి కేంద్ర ఆరోగ్యశాఖ మంత్రి జేపీ నడ్డాతో సమావేశమయ్యారు. మల్లాడితో పాటు కేంద్ర పర్యాటక శాఖ జాయింట్ సెక్రటరీ అంకిత్‌మిశ్రా, పుదుచ్చేరికి చెందిన జిప్మెర్ డైరెక్టర్ డాక్టర్ వీర్‌సింగ్‌నేగీ, డీడీ రంగబ్యాశ్యామ్, నోడల్ అధికారి డాక్టర్ దిలీప్‌కుమార్ మౌర్య పాల్గొన్నారు. ఈసందర్భంగా మంత్రి నడ్డాను శాలువతో సత్కరించారు. యానాం ఇంజనీరింగ్ కళాశాలను ప్రభుత్వం తీసుకుని వాటిలో కేన్సర్ రీసెర్చ్ ఇనిస్టిట్యూట్‌ను ఏర్పాటు చేయాలని కోరారు. పారామెడికల్ కోర్సులు ఏర్పాటుతో పాటు కారైకాల్ తరహాలో 50ఎంబీబీఎస్ సీట్లతో మెడికల్ కళాశాలను ఏర్పాటు చేయాలన్నారు. యానాం జిప్మెర్ ఆసుపత్రిలో స్థానికులకు ఉద్యోగ అవకాశాలు కల్పించాలన్నారు. వీటిపై సానుకూలంగా స్పందించిన మంత్రి త్వరలో జనరల్ బాడీ సమావేశం ఏర్పాటు చేయాలని, నివేదికలను పూర్తిస్థాయిలో సిద్ధం చేయాలని సిబ్బందికి మంత్రి సూచించారని మల్లాడి తెలిపారు. యానాం పర్యాటక శాఖ ప్రాజెక్టులపై కేంద్ర పర్యాటకశాఖ ఎడిషనల్ సెక్రటరీ సుమన్ బాల్లాతో మల్లాడి భేటీ అయ్యారు. యానాం టవర్ పూర్తిస్థాయిలో అభివృద్ధి పరిచేందుకు రూ.20.16కోట్లతో నివేదిక, రూ.16.58కోట్లతో యానాం టైడాల్‌లాక్ నుంచి రాజీవ్‌బీచ్ వరకు శివంబాత్, రాజీవ్‌బీచ్ రీనోవేషన్ అభివృద్ధి చేయడానికి ప్రతిపాదనలు ఇచ్చామన్నారు. వీటికి సంబంధించి కేంద్రం నుంచి అనుమతులు రానున్నాయని మల్లాడి అన్నారు.

ఉపాధి హామీలో అడిగిన వారందరికీ పని



వక్కలంకలో వివాదస్పద స్థలాన్ని పరిశీలిస్తున్న ఎమ్మెల్యే గిడ్డి

అంబాజీపేట, ఏప్రిల్ 17(ఆంధ్రజ్యోతి): జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం ద్వారా అడిగిన వారందరికి పని కల్పిస్తామని ఎమ్మెల్యే గిడ్డి సత్యనారాయణ అన్నారు. వక్కలంకలో చెరువు పూడికతీత పనులు ప్రారంభానికి ఆయన గురువారం భూమి పూజ చేశారు. ఈ సందర్భంగా 12240 పని దినాలతో రూ.37లక్షలతో ఈచెరువు పనులు చేపడతామన్నారు. రాష్ట్ర ప్రభుత్వంలో కేంద్రం ద్వారా ఉపాధి కూలీలకు వేతనం రూ.300 పెంచామన్నారు.

వివాదాస్పద స్థలం పరిశీలన:

తొలుత వక్కలంక గ్రామంలో చెరువు గట్టు వద్ద ఉన్న దేవాలయం నిర్మాణానికి సంబంధించి వివాదాస్పద స్థలాన్ని ఎమ్మెల్యే పరిశీలించారు. ఓ దశలో ఆయన సమక్షంలో రెండు వర్గాలు మధ్య వాగ్వివాదం జరిగింది. దీంతో ఎమ్మెల్యే మాట్లాడుతూ ఈసమస్యను తన కార్యాలయంలో పరిష్కరిస్తామన్నారు. రెండు వర్గాల వారు తన కార్యాలయానికి రావాలని సూచించారు. దీంతో వివాదం తాత్కాలికంగా సద్దుమణిగింది. ఎంపీపీ దొమ్మేటి వెంకటేశ్వరరావు, సర్పంచ్ వాసంశెట్టి రేవతిపెదబాబు, నాయకులు శిరిగినీడి వెంకటేశ్వరరావు, చిన్నం బాలవిజయరావు, మైపాల తాతాజీ, గుడాల పణి, యనమదల రాజబాబు, పితాని శ్రీనివాసరావు, నేదునూరి కల్యాణ్, పెదపూడి శ్రీనివాసరావు, వాసంశెట్టి రాంబాబు, గుబ్బల నాగవెంకటరమణ, పిల్లి శ్రీనివాస్, అధికారపు బాబ్జి, పంచాయతీ కార్యదర్శి వి.తాతాజీ పాల్గొన్నారు.

రమేష్‌కు సత్కారం

రాజోలు, ఏప్రిల్ 17(ఆంధ్రజ్యోతి): తెలుగు నాటక రంగ ఆవిర్భావ దినోత్సవాన్ని పురస్కరించుకుని రాజోలులో ఎస్ఆర్ఎల్టీ కళాసమితి ఆధ్వర్యంలో కళాకారుడు, న్యాయవాది, సోషల్ వర్కరు యాలంగి రమేష్‌ను ఘనంగా సత్కరించారు.

అన్ని డిపోల్లో 1/2019 సర్క్యులర్ అమలుచేయాలి



ప్లకార్డులతో నిరసన తెలుపుతున్న ఎన్ఎంయూ ప్రతినిధులు

అమలాపురం రూరల్, ఏప్రిల్ 17 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలోని అన్ని ఆర్టీసీ డిపోల్లో 1/2019 సర్క్యులర్‌ను అమలుచేయాలని నేషనల్ మజ్దూర్ యూనిటి అసోసియేషన్ జిల్లా కార్యదర్శి పి.రాంబాబు డిమాండ్ చేశారు. ఎన్ఎంయూ డిపో కమిటీ అధ్యక్ష, కార్యదర్శులు ఎండీ ఔలియా, మణిరాజుల ఆధ్వర్యంలో రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు ఉద్యోగులు ప్లకార్డులు చేతబూని గురువారం అమలాపురం ఆర్టీసీ డిపోలో ధర్నా నిర్వహించారు. రీజనల్ కార్యదర్శి రాంబాబు మాట్లాడుతూ అక్రమ సస్పెన్షన్లు ఎత్తివేయాలని, నిబంధనలకు విరుద్ధంగా రిమూవ్ చేస్తున్న ఉద్యోగులను విధుల్లోకి తీసుకోవాలని,నిలిచిపోయిన పదోన్నతులు కల్పించాలని డిమాండ్ చేశారు. గ్యారేజీ కమిటీ కార్యదర్శి గౌరీనాథ్, డిపో కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

కరణం నాగేశ్వరరావు మృతి



అమలాపురం రూరల్, ఏప్రిల్ 17(ఆంధ్రజ్యోతి): సాకుర్రు కరణంగా పేరొందిన అజ్జరపు నాగేశ్వరరావు(75) గురువారం ఉదయం ఆయన స్వగృహంలో మృతిచెందారు. బ్రిటీష ప్రభుత్వ హయాంలోనే నాగేశ్వరరావు తండ్రి సుబ్బారావు కరణంగా పనిచేశారు. అనంతరం నాగేశ్వరరావు కరణంగా కొనసాగారు. ఆయనకు ఇద్దరు కుమార్తెలు, కుమారుడు ఉన్నారు. నాగేశ్వరరావు మృతిచెందడంతో మిత్రుడైన మాజీమంత్రి గొల్లపల్లి సూర్యారావు హుటాహుటిన చేరుకున్నారు. ఆయనతో పాటు సర్పంచ్‌లు గుత్తుల చిరంజీవ, పెద్దిరెడ్డి రాము, మాజీ సర్పంచ్‌లు చొల్లంగి సత్యసాయిబాబా, ములపర్తి సత్యనారాయణ, నాయకులు పొలమూరి దర్మపాల్, బొంతు సోమిశెట్టి, పొలమూరి బాలకృష్ణ, హెచ్‌ఎం పి.బాబూరావు తదితరులు ఆయన భౌతికకాయంపై పూలమాలలువేసి నివాళులర్పించారు.

నెలాఖరు నాటికి ఈకేవైసీ పూర్తి చేసుకోవాలి

అమలాపురం టౌన్, ఏప్రిల్ 17 (ఆంధ్రజ్యోతి): జిల్లాలోని ప్రతీ రేషన్ కార్డుదారుడు నెలాఖరు నాటికి ఈకేవైసీ తప్పనిసరిగా చేయించుకోవాలని జిల్లా పౌరసరఫరాల అధికారి అడపా ఉదయభాస్కర్ గురువారం పేర్కొన్నారు. ప్రతీ తెల్లరేషన్‌కార్డు దారుడు తమకు వచ్చే బియ్యం పంపిణీ ఆగిపోకుండా ఉండాలంటే ఈకేవైసీని పూర్తి చేసుకోవాలని తెలిపారు.

ప్రభుత్వ పాఠశాలల్లో నాణ్యమైన విద్య

పి.గన్నవరం, ఏప్రిల్ 17(ఆంధ్రజ్యోతి): ప్రైవేటు పాఠశాలలకు దీటుగా ప్రభుత్వ పాఠశాలల్లో నాణ్యమైన విద్య అందుతుందని ఎమ్మెల్యే గిడ్డి సత్యనారాయణ, డీఈవో షేక్ సలీంబాషా అన్నారు. పోతవరం మండలపరిషత్ ప్రాథమిక పాఠశాల వార్షికోత్సవం సందర్భంగా బుధవారంరాత్రి హెచ్‌ఎం కత్తుల ఆనందరావు ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో వారు మాట్లాడారు. ఎంపీపీ గనిశెట్టి నాగలక్ష్మి, సర్పంచ్ వడలి కొండయ్య, ఎంపీటీసీ పులపర్తి రాజారావు, డీసీఈబీ కార్యదర్శి బి.హనుమంతరావు, ఎంఏకె భీమారావు, ఎస్టీయూ జిల్లా అధ్యక్షుడు పి.దొరబాబు, పల్లంరాజు పాల్గొన్నారు.

ఆకుమర్తి సూర్యనారాయణ సేవలు ప్రశంసనీయం

మామిడికుదురు, ఏప్రిల్ 17(ఆంధ్రజ్యోతి): మాదిగ రిజర్వేషన్ పోరాట సమితి ఆధ్వర్యంలో ఎమ్మార్పీఎస్ ఉద్యమంలో దివంగత ఆకుమర్తి సూర్యనారాయణ చేసిన సేవలు అమూల్యమైనవని పలువురు వక్తలు కొనియాడారు. మామిడికుదురు బస్టాండు కూడలిలో సూర్యనారాయణ ఎనిమిదో వర్థంతిని గురువారం ఎమ్మార్పీఎస్, ఎమ్మెస్పీ నాయకులు నిర్వహించారు. ఆయన చిత్రపటానికి పూలమాలలువేసి నివాళులర్పించారు. ఎమ్మెస్పీ జిల్లా అధికార ప్రతినిధి నూటుకుర్తి సత్యనారాయణ, ముసూడి నాగప్రభాకర్, ఆకుమర్తి ఆశీర్వాదం, చుట్టుగుళ్ల నీలకంఠం, చుట్టుగుళ్ల కిశోర్, మంద గాంధీ, బొంతు సుధాకర్, చాట్ల సత్యనారాయణ, శెట్టెం రమేష్ పాల్గొన్నారు.

ప్రణాళికలు రూపొందించుకోవాలి

అంబాజీపేట, ఏప్రిల్ 17(ఆంధ్రజ్యోతి): రానున్న విద్యాసంవత్సరానికి సంబంధించి విద్యార్థులు ఇప్పటి నుంచే ప్రణాళికలు రూపొందించుకోవాలని జిల్లా విద్యాశాఖాధికారి షేక్ సలీంబాషా సూచించారు. ముక్కామల జిల్లా పరిషత్ హైస్కూల్‌లో జిల్లా విద్యాశాఖ రూపొందించిన ట్రాన్స్‌క్షన్ వారోత్సవాల కార్యక్రమాన్ని డీఈవో గురువారం పరిశీలించారు. హిందీ పదాలు, వాఖ్యాలు నేర్పించుట అనే కార్యక్రమంలో పాల్గొని విద్యార్థులను ఉత్తేజపరిచారు. డొక్కాసీతమ్మ మధ్యాహ్న భోజన పథకంలో భాగంగా రాగిజావను విద్యార్థులకు ఆయన అందించి, రుచి చూశారు. కార్యక్రమంలో హెచ్‌ఎం ఎంఎస్ఆర్ మూర్తి, ఉపాధ్యాయులు సీఆర్పీ దుర్గారావు పాల్గొన్నారు.

రుణాలకు దరఖాస్తుల ఆహ్వానం

ముమ్మిడివరం, ఏప్రిల్ 17(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వం మంజూరు చేసిన ఎస్సీ కార్పొరేషన్ రుణాలకు దరఖాస్తులకు ఆన్‌లైన్ ప్రారంభమైందని, మే నెల 10వ తేదీలోపు ఆన్‌లైన్‌లో సప్లయి చేసుకోవచ్చునని ముమ్మిడివరం నగరపంచాయతీ కమిషనర్ పి.రవివర్మ పేర్కొన్నారు. దరఖాస్తుతో ఆధార్‌కార్డు, లింకైన ఫోన్ నంబరు, రేషన్‌కార్డు కుల ఆదాయ ధ్రువీకరణ పత్రం, డ్రైవింగ్ లైసెన్సులతో ఆన్‌లైన్‌లో అప్లయి చేసుకుని ఇంటర్వ్యూలకు అన్ని పత్రాలతో హాజరు కావాలన్నారు. కులధ్రువీకరణ పత్రం కలిగి ఉండాలన్నారు.

బడిబాట.. బంగారుబాట.. కార్యక్రమం

అంతర్వేది, ఏప్రిల్ 17(ఆంధ్రజ్యోతి): అంతర్వేది సైకిల్‌షాపు సెంటర్‌లో మోడల్ ప్రైమరీ పాఠశాలలో విద్యార్థినులను చేర్చుకునేందుకు ప్రభుత్వ బడిబాట బంగారు బాట కార్యక్రమాన్ని గురువారం నిర్వహించారు. ప్రభుత్వం ప్రతీ విద్యార్థికి రూ.15వేలు ఆర్థికసాయం అందజేస్తూ, పాఠ్య పుస్తకాలు, ఏకరూపు దుస్తులు, మధ్యాహ్న భోజనం అందిస్తుందని తెలిపారు. కార్యక్రమంలో ఎంఈవోలు డి.కిశోర్‌కుమార్, ఎం.వెంకటేశ్వరరావు, ఎంపీటీసీ చొప్పల బాబూరావు, పాఠశాల హెచ్‌ఎం కె.మరియమ్మ, మధువర్మరాజు, సూర్యకుమారి, ఎస్ఎంసీ ఛైర్మన్ జి.ఏసుబాబు తదితరులు పాల్గొన్నారు.

బుర్రకథ కళాకారుడిగా కామేశ్వరరావుకు జాతీయస్థాయి గుర్తింపు

అమలాపురంటౌన్, ఏప్రిల్17(ఆంధ్రజ్యోతి): అమలాపురం మహాత్మాగాంధీ మున్సిపల్ ఉన్నత పాఠశాల హెచ్‌ఎంగా పనిచేస్తున్న బందా రత్నాకర కామేశ్వరరావు బుర్రకథ కళాకారునిగా జాతీయస్థాయి గుర్తింపు పొందారని కోనసీమ సైన్స్ పరిషత్ వ్యవస్థాపకుడు డాక్టర్ సీవీ సర్వేశ్వరశర్మ పేర్కొన్నారు. అమలాపురం రవీంద్ర విద్యాసంస్థల వార్షికోత్సవాన్ని పురస్కరించుకుని గురువారం నిర్వహించిన కార్యక్రమానికి విశ్రాంత తెలుగు ఉపాధ్యాయుడు మండలీక ఆదినారాయణ అధ్యక్షత వహించారు. ఈసందర్భంగా హెచ్‌ఎం కామేశ్వరరావు ఉపాధ్యాయుడిగానే కాకుండా, రాష్ట్ర ప్రభుత్వ పథకాలపై గతంలో బుర్రకథ రూపంలో రాష్ట్ర వ్యాప్తంగా ప్రదర్శనలు నిర్వహించి అప్పట్లో సీఎం చంద్రబాబు నుంచి ప్రశంసలు అందుకున్నారని కొనియాడారు.

నామన రాంబాబును కలిసిన ఏఎంసీ ఛైర్మన్

మామిడికుదురు, ఏప్రిల్ 17(ఆంధ్రజ్యోతి): జడ్పీ మాజీ ఛైర్మన్ నామన రాంబాబును ఆయన స్వగృహంలో అంబాజీపేట ఏఎంసీ ఛైర్మన్‌గా నియమితులైన చిట్టూరి శ్రీనివాస్ మర్యాద పూర్వకంగా కలుసుకున్నారు. ఆయన్ను కలుసుకుని దుశ్శాలువాలు, పూలమాలలతో సన్మానించారు. ఈ సందర్భంగా నామన రాంబాబు మాట్లాడుతూ ఏఎంసీ అభివృద్ధికి ఛైర్మన్‌గా కృషి చేయాలని సూచించారు. కార్యక్రమంలో టీడీపీ మద్దాల సుబ్రహ్మణ్యేశ్వరరావు, గుత్తుల బాబి, వస్కా శ్యామ్, నాయకులు పాల్గొన్నారు.

ముగిసిన అంబేద్కర్ జయంతి వారోత్సవాలు

మలికిపురం, ఏప్రిల్ 17(ఆంధ్రజ్యోతి): అంబేద్కర్ జయంతి వారోత్సవాల ముగింపు సందర్భంగా ఈనెల19న అమలాపురం సత్యనారాయణ విలాస్‌లో మేధావుల సదస్సు నిర్వహిస్తున్నట్టు బీజేపీ జిల్లా అధికారి ప్రతినిధి మాలే శ్రీనివాసనగేష్ తెలిపారు. జిల్లా అధ్యక్షుడు అడబాల సత్యనారాయణ అధ్యక్షతన జరిగే సదస్సుకు ముఖ్యఅతిథిగా యచ్చర్ల బీజేపీ ఎమ్మెల్యే నడికుడిటి ఈశ్వరరావు, ముళ్లపూడి రేణుక పాల్గొంటారన్నారు.


ప్రత్యేక అధికారులను నియమించాలి

ముమ్మిడివరం, ఏప్రిల్ 17 (ఆంధ్రజ్యోతి): ముమ్మిడివరం సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాలలో విద్యార్థినులకు కుళ్లిన, నాసిరకం కూరగాయలతో ఆహారాన్ని అందించడంపై వైసీపీ విద్యార్థి విభాగం జోనల్ అధ్యక్షుడు జిల్లెల్ల రమేష్, జిల్లా అధ్యక్షుడు మిండగుదటి శిరీష్, ఐటీ విభాగం జిల్లా అధ్యక్షుడు తోరం గౌతమ్, గంటి ఆకాశ్‌లతో కూడిన బృందం గురువారం ఆ పాఠశాలను సందర్శించారు. నాసిరకం, కుళ్లిన కూరగాయలతో విద్యార్థులకు ఆహారాన్ని అందిస్తున్నా ప్రభుత్వం స్పందించకపోవడం దారుణమన్నారు. పాఠశాల నిర్వహణకు తక్షణమే తగినన్ని నిధులు విడుదల చేయాలని, గురుకుల పాఠశాలల పర్యవేక్షణకు ప్రత్యేకాధికారిని నియమించాలని, విద్యార్థుల ఆరోగ్యం, భద్రతకు ప్రభుత్వం పూర్తి బాధ్యత వహించాలని వారు డిమాండ్ చేశారు. డిమాండ్లపై ప్రభుత్వం స్పందించకపోతే వైసీపీ విద్యార్థి విభాగం ఆధ్వర్యంలో రాష్ట్ర వ్యాప్తంగా పెద్దఎత్తున ఆందోళన కార్యక్రమం చేపడతామని హెచ్చరించారు.

నియోజకవర్గంలో పర్యటనకు శ్రీకాంత్ శ్రీకారం

ఉప్పలగుప్తం, ఏప్రిల్ 17(ఆంధ్రజ్యోతి): వైసీపీ అమలాపురం అసెంబ్లీ నియోజకవర్గ సమన్వయకర్తగా నియమితులైన పినిపే శ్రీకాంత్ తన కార్యాచరణకు గురువారం ఎన్.కొత్తపల్లిలో శ్రీకారం చుట్టారు. అక్కడి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. కార్యకర్తలకు అండగా ఉంటానన్నారు. పార్టీ మండల అధ్యక్షుడు బద్రి బాబ్జి, జిల్లా మహిళా అధ్యక్షురాలు వంగా గిరిజానాగకుమారి, జడ్పీటీసీ గెద్దం సంపదరావు, మోటూరి సత్యంకాపు, కడిమి చిన్నవరాజు,సలాది సతీష్, బొడ్డు నాగేశ్వరరావు పాల్గొన్నారు.

ఆక్వా రైతు సంఘ జిల్లా అధ్యక్షుడిగా దెందుకూరి



అల్లవరం, ఏప్రిల్ 17(ఆంధ్రజ్యోతి): ఆక్వారైతుల సంఘం జిల్లా అధ్యక్షుడిగా టీడీపీ మండల అధ్యక్షుడు సత్తిబాబురాజును ఆక్వారైతులు ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. గోడి ఉపసర్పంచ్‌గా, టీడీపీ మండల అధ్యక్షుడిగా పార్టీ అభివృద్ధికి విశేష కృషి చేశారు. సత్తిబాబురాజును ఎమ్మెల్యే అయితాబత్తుల ఆనందరావు, ఆక్వా రైతులు రుద్రరాజు సూర్యనారాయణరాజు, తోలేటి దొరయ్యనాయుడు, త్సవటపల్లి నాగభూషణం, దాట్ల పృథ్వీవర్మ, మేడిద శంకరరావు, సయ్యపరాజు సత్తిబాబురాజు, మోటూరి నాని, నంద్యాల శివాజీ, మంతెన సురేష్‌రాజు అభినందించారు.

శతాధిక వృద్ధురాలు సీతమ్మ మృతి



మామిడికుదురు, ఏప్రిల్ 17(ఆంధ్రజ్యోతి): మామిడికుదురు గ్రామానికి చెందిన శతాధిక వృద్ధులు బోయి సీతమ్మ(102) గురువారం కన్నుమూశారు. ఆమెకు ఇద్దరు కుమారులు, ఐదుగురు కుమార్తెలు, 23మంది మనుమలు, 37మంది మునిమనుమలు, ఏడుగురు మునిమునిమనుమలు ఉన్నారు. చనిపోయే వరకు ఆమె తన పనులు తానే చేసుకునేదని ఆమె కుమారుడు సీనియర్ జర్నలిస్టు బోయి రాంబాబు తెలిపారు.

బడిఈడు పిల్లల్ని బడిలో చేర్పించండి

రాజోలు, ఏప్రిల్ 17 (ఆంధ్రజ్యోతి): ఎన్‌రోల్మెంట్ డ్రైవ్ ద్వారా బడిఈడు పిల్లల్ని బడిలో చేర్చుకుంటున్నామని రాజోలు ఎంఈవో ఎన్.మనోహరం తెలిపారు. రాజోలులో ఆయన శుక్రవారం విలేఖరులతో మాట్లాడుతూ ప్రభుత్వ బడే మన బడి అని, కార్పొరేట్ పాఠశాలలకు దీటుగా ప్రభుత్వ పాఠశాలలు ఫలితాలు సాధిస్తున్నాయన్నారు. సర్వేపల్లి రాధాకృష్ణ విద్యామిత్ర ద్వారా విద్యార్థులకు బ్యాగులు, నోటు పుస్తకాలు, టెక్ట్స్ పుస్తకాలు, మూడు జతల ఏకరూపు దుస్తులు, ఒక జత బూట్లు, రెండు జతల సాక్సులు, బెల్టులను ఉచితంగా విద్యార్థులకు అందజేస్తున్నట్టు తెలిపారు. తల్లికి వందనం పేరిట చదువుకునే ప్రతీ విద్యార్థి తల్లికి రూ.15వేలు ఆమె అకౌంట్‌లో వేయడం జరుగుతుందని పేర్కొన్నారు. తల్లిదండ్రులు పిల్లలను ప్రభుత్వ పాఠశాలల్లో చేర్పించాలని ఆయన కోరారు.

వెంకన్న ఆలయంలో అభివృద్ధి పనుల పరిశీలన



ఆలయంలోని అభివృద్ధి పనులను పరిశీలిస్తున్న స్థపతి ఇంజనీరింగ్ బృందం

ఆత్రేయపురం, ఏప్రిల్ 17(ఆంధ్రజ్యోతి): వాడపల్లి వేంకటేశ్వరస్వామి ఆలయంలో జరుగుతున్న వివిధ అభివృద్ధి పనులను స్థపతి పి.పరమేశప్ప పరిశీలించారు. పెరుగుతున్న భక్తుల రద్దీ నేపథ్యంలో ఆళ్వార్ మండపం వద్ద తూర్పు, దక్షిణ, ఉత్తరం వైపు ద్వారాలను వెడల్పు చేయాలని ఆయన సూచించారు. ఎమ్మెల్యే బండారు సత్యానందరావు ఆదేశాల మేరకు ద్వారాలు వెడల్పు చేపట్టాలని సూచించారు. అనంతరం క్యూలైన్ల పైఓవర్లు, మరుగుదొడ్లు తదితర పనులను ఆయన పరిశీలించారు. ఆలయం ఎదురుగా కొనేరు పుష్కరిణి పనులు, శ్రీనివాస ప్రాంగణం లో చేపడుతున్న అభివృద్ధి పనులను ఆయన పరిశీలించారు. ఆలయ ఉప కమిషనరు నల్లం సూర్యచక్రధరరావు, దేవదాయశాఖ డీఈ శ్రీనివాసరావు, సిబ్బంది ఆయా పనులను స్థపతికి వివరించారు. ఆయన సూచనల మేరకు పనులను చేపడుతున్నట్లు ఈవో తెలిపారు.



ఓఎన్జీసీ ప్రజాభిప్రాయ సదస్సులో ఆవేదన వ్యక్తం చేస్తున్న రైతులు

రైతులను ముంచుతున్న ఓఎన్జీసీ

ప్రజాభిప్రాయ సేకరణలో పలువురు ధ్వజం

ఆలమూరు, ఏప్రిల్ 17(ఆంధ్రజ్యోతి): తమ భూమిలోని చమురు, సహజ వాయువులతో రూ.కోట్లు ఆర్జిస్తున్న ఓఎన్జీసీ తమను మాత్రం నిలువునా ముంచుతోందని పలువురు రైతులు ఆవేదన వ్యక్తం చేశారు. ఆలమూరులో ఓఎన్జీసీ ఏర్పాటు చేసిన ప్రజాభిప్రాయ సేకరణ సదస్సులో రైతులు సమస్యలతో చుట్టుముట్టారు. జాయింట్ కలెక్టర్ నిశాంతి, ఆర్డీవో అఖిల సమక్షంలో ఓఎన్జీసీ అధికారుల తీరును ఎండగట్టారు. లీజుకు తీసుకున్న భూమికి ఎన్ని సంవత్సరాలైన లీజు మార్పులు చేయడం లేదని తెలుగుదేశం నాయకుడు సలాది నాగేశ్వరరావు అధ్వర్యంలో రైతులు ధ్వజమెత్తారు. తమ సమస్యలను చెప్పేందుకు రాజమహేంద్రవరంలోని కార్యాలయానికి వెళితే గేటు వద్దకు కూడా రానీయడం లేదన్నారు. ఓఎన్జీసీ తీరుపై పలువురు రైతులు వారికి వినతిపత్రం అందజేశారు.

సీహెచ్‌వోలను రెగ్యులర్ ఉద్యోగులుగా గుర్తించాలి

ఆలమూరు, ఏప్రిల్ 17(ఆంధ్రజ్యోతి): గ్రామీణ ప్రాంతాల్లో ఏర్పాటు చేసిన ఆయుష్మాన్ భారత్ మందిరాల్లో పనిచేస్తున్న కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్ (సీహెచ్‌వో)లను రెగ్యులర్ ఉద్యోగులుగా గుర్తించాలని కోరుతూ గురువారం మండలంలోని పెదపళ్ల, చొప్పెల్ల పీహెచ్‌సీ వద్ద వారు నిరసన తెలిపారు. దీర్ఘకాలంగా ఉన్న సమస్యలను పరిష్కరించాలని, ఉద్యోగ భద్రత కల్పించాలని కోరుతూ పెదపళ్ల, చొప్పెల్ల పీహెచ్‌సీ వైద్యాధికారులకు వినతిపత్రాలు అందజేశారు.



పెదపళ్ల పీహెచ్‌సీ వైద్యాధికారికి వినతి పత్రం అందిస్తున్న సీహెచ్‌వోలు

విద్యార్థులకు మున్సిపల్ చైర్‌పర్సన్ అభినందన



విద్యార్థులకు సర్టిఫికెట్‌లు అందిస్తున్న మున్సిపల్ చైర్‌పర్సన్ శ్రీదేవి

ద్రాక్షారామ, ఏప్రిల్ 17(ఆంధ్రజ్యోతి): రాష్ట్రస్థాయిలో నిర్వహించిన ఐఎస్‌టీవో ఒలింపియాడ్ రెండోదశ పోటీ పరీక్షల్లో ప్రతిభ కనబర్చిన శ్రీచైతన్య విద్యా సంస్థల విద్యార్థులను రామచంద్రపురం మున్సిపల్ చైర్‌పర్సన్ శ్రీదేవి అభినందించారు. రామచంద్రపురం మున్సిపల్ కార్యాలయంలో గురువారం జరిగిన కార్యక్రమంలో మొదటి ఐదు స్థానాలు సాధించిన విద్యార్థులను సత్కరించి ట్యాబ్, బంగారు పతకాలను అందజేశారు. తమ పాఠశాలలో అందిస్తున్న ఐఐటీ శిక్షణతో తమ విద్యార్థులు ఒలింపియాడ్ పోటీ పరీక్షల్లో ముందంజలో ఉంటున్నారని రీజనల్ ఇన్ చార్జ్ నరేష్ అన్నారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ రాము, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.



ఏడిద పాఠశాలలో ఇంటర్ విద్యార్థులను సన్మానిస్తున్న డీఈవో సలీంబాషా


ఇంటర్ ఫలితాల్లో ఏడిద పాఠశాల ఆదర్శం

డీఈవో సలీం బాషా

మండపేట, ఏప్రిల్ 17(ఆంధ్రజ్యోతి): జిల్లాలో ఇంటర్ ఫలితాల సాధనలో ఏడిద జడ్పీ ప్లస్ పాఠశాల ఆదర్శమని డీఈవో సలీం బాషా అన్నారు. విద్యార్థుల ప్రవేశాలు, ఆకర్షణ వారోత్సవాల్లో భాగంగా గురువారం ఆయన ఏడిద జడ్పీ హైస్కూల్‌ను సందర్శించారు. బడి ఆకర్షణ వారోత్సవాల ప్రాధాన్యతను ఉపాధ్యాయులకు తెలిపారు. పాఠశాల ప్రగతిని ఆయన సమీక్షించారు. ఉత్తమ ఫలితాలకు కారకులైన హెచ్‌ఎం, ఉపాధ్యాయులను ప్రశంసించారు. ఇంటర్ సెకండ్ ఇయర్‌లో స్టేట్ బెస్ట్‌గా నిలిచిన కొమ్ము శైలజ, ఫస్ట్ ఇంటర్‌లో స్టేట్ ఫస్ట్ సాధించిన పంతం రమ్యశ్రీ, సెకండ్ ఇంటర్ బైపీసీలో కాలేజ్ ఫస్ట్ సాధించిన బాదంపూడి సత్యశ్రీని డీఈవో సత్కరించారు. కార్యక్రమంలో ఎంఈవోలు నాయుడు రామచంద్రరావు, సోమిరెడ్డి, సర్పంచ్ బూరిగ ఆశీర్వాదం, మాజీ సర్పంచ్ చిలుకూరి శ్రీనివాసరావు, హెచ్‌ఎం ముంగర వెంకట్రాజు తదితరులు పాల్గొన్నారు. స్టేట్ బెస్ట్‌గా నిలిచిన శైలజకు విద్యా పోత్సాహకుల నుంచి రూ.5లక్షల పురస్కారం లభించింది.

వాడపల్లి ఒకరోజు ఆదాయం రూ.3.18 లక్షలు

ఆత్రేయపురం, ఏప్రిల్ 17(ఆంధ్రజ్యోతి): వాడపల్లి వేంకటేశ్వరస్వామి ఆలయానికి గురువారం వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన భక్తులతో రద్దీ నెలకొంది. నోము ఆచరించిన భక్తులు అష్టోత్తర పూజలు, నిత్య కల్యాణాలు జరిపారు. స్వామివారిని దర్శించుకున్న అనంతరం భక్తులు అన్నప్రసాదంలో పాల్గొన్నారు. వివిధ సేవల ద్వారా ఒక్కరోజు ఆదాయం రూ.3,18,591 వచ్చినట్టు ఉపకమిషనరు, ఈవో నల్లం సూర్యచక్రధరరావు తెలిపారు.



వాడపల్లి వేంకటేశ్వరస్వామి ఆలయంలో అష్టోత్తర పూజలు నిర్వహిస్తున్న దృశ్యం

గ్రామాల్లో పంటకోత ప్రయోగాలు

కపిలేశ్వరపురం, ఏప్రిల్ 17(ఆంధ్రజ్యోతి) : మండలంలోని టేకి, కోరుమిల్లి, వడ్లమూరు, మాచర గ్రామాల్లో గురువారం వ్యవసాయ శాఖ ఆధ్వర్యంలో పంటకోత ప్రయోగాలు నిర్వహించారు. టేకిలో ఎక్స్‌పెర్మెంట్ నంబరు-1లో 29.700 కిలోలు, ఎక్స్‌పెర్మెంట్-4లో 26.500 కిలోలు వచ్చిందని, యావరేజ్‌గా ఎకరానికి 50 నుంచి 55 బస్తాల దిగుబడి వచ్చినట్లు ఏవో రమేష్‌కుమార్ తెలిపారు. కార్యక్రమంలో రామచంద్రపురం డివిజన్ అర్థగణాంకశాఖ అధికారిణి సీహెచ్ సూర్యనారాయణమ్మ, ఏఎస్‌వో సీవీవీ సత్యనారాయణ, గ్రామ వ్యవసాయ సహాయకులు జి. హరిబాబు, వీఆర్‌ఏ గంగరాజు, దాకి ఏసు, వడ్లమూరి సూరిబాబు, రైతులు పాల్గొన్నారు.



టేకిలో పంటకోత ప్రయోగం నిర్వహిస్తున్న దృశ్యం

మండపేట

• కొత్తపేట • మండపేట • రామచంద్రపురం



సమావేశంలో మాట్లాడుతున్న మంత్రి సుభాష్

20న ఉచిత వైద్య శిబిరం

ద్రాక్షారామ, ఏప్రిల్ 17(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు జన్మదినాన్ని పురస్కరించుకుని 20న రామచంద్రపురంలో మీ ఆరోగ్యం మా బాధ్యత నినాదంతో సత్యం వాసంశెట్టి ఫౌండేషన్ ఆధ్వర్యంలో మెగా ఉచిత వైద్య శిబిరం ఏర్పాటు చేసినట్లు కార్మికశాఖా మంత్రి వాసంశెట్టి సుభాష్ తెలిపారు. గురువారం ఆయన విలేకరుల సమావేశం నిర్వహించారు. ఆదివారం ఉదయం 9 గంటల నుంచి వీఎస్‌ఎం కళాశాల ప్రాంగణంలో అపోలో, మెడికవర్, మెడ్‌వే, సంజీవిని, అగర్వాల్ కంటి ఆసుపత్రుల నుంచి పలువురు వైద్యులు సేవలందిస్తారని ఆయన అన్నారు. ఉచితంగా మందులు కూడా పంపిణీ చేయనున్నట్లు తెలిపారు. రామచంద్రపురం నియోజకవర్గంలోని ప్రజలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. ముఖ్యమంత్రి చంద్రబాబు జన్మదినాన్ని పురస్కరించుకుని పలు కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు ఆయన అన్నారు.



టేకిలోని ఎలగాలమ్మ అమ్మవారు

ఘనంగా ఎలగాలమ్మ తీర్థం

కపిలేశ్వరపురం, ఏప్రిల్ 17(ఆంధ్రజ్యోతి) : మండలంలోని టేకి గ్రామంలోనున్న ఎలగాలమ్మ తీర్థం గురువారం ఘనంగా జరిగింది. జాతరను పురస్కరించుకుని గరగనృత్యాలు, డప్పు వాయిద్యాల మధ్య బుధవారం రాత్రి వైభవంగా నిర్వహించారు. అమ్మవారిని భక్తులు దర్శించుకుని చీర, రవిక, పసుపు, కుంకుమ, గాజులు, నైవేద్యాలు సమర్పించి మొక్కుబడులు చెల్లించారు. కార్యక్రమంలో గ్రామస్తులతో పాటు సమీప గ్రామాల భక్తులు, ఆలయ కమిటీ సభ్యులు, అధిక సంఖ్యలో మహిళలు పాల్గొన్నారు.

23న పుంతలో ముసలమ్మ విగ్రహ ప్రతిష్ఠ

రాయవరం, ఏప్రిల్ 17(ఆంధ్రజ్యోతి): రాయవరం గ్రామస్తుల ఇలవేల్పు శ్రీపుంతలో ముసలమ్మ విగ్రహ ప్రతిష్ఠను 23న నిర్వహించనున్నట్లు ఆలయ కమిటీ తెలిపింది. గురువారం ఆలయ కమిటీ సభ్యులు మాట్లాడుతూ 22న మంగళవారం ఉదయం వినాయక పూజ, పుణ్యాహ వచనం, యాగశాల ప్రవేశం, మండపారాధనలు, అమ్మవారికి జలాధి, పుష్పాదివాసం, అంకురార్పణ, అగ్ని మధనం, హోమం, క్షీరాధివాసం తదితర పూజలు నిర్వహించనున్నారు. ఈనెల 23న ఉదయం అమ్మవారి విగ్రహ ప్రతిష్ఠ, పూర్ణాహుతి, గోముఖ దర్శనం తదితర పూజల అనంతరం అన్నసమారాధన నిర్వహిస్తామన్నారు. ఈనెల 26న అమ్మవారి జాతర, 27న అమ్మవారి తీర్థం నిర్వహించనున్నట్లు నిర్వాహకులు తెలిపారు.

మిర్చి రైతు నడ్డివిరిచిన రాష్ట్ర ప్రభుత్వం



కామన ప్రభాకరరావు

మండపేట, ఏప్రిల్ 17 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం మిర్చి రైతుల నడ్డి విరిచిందని కాంగ్రెస్ కిసాన్ సెల్ రాష్ట్ర అధ్యక్షుడు కామన ప్రభాకరరావు వ్యాఖ్యానించారు. మండపేటలోని కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో గురువారం ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. మిర్చి రైతుల పరిస్థితి దయనీయంగా ఉందన్నారు. కనీస మద్దతు ధర లేకపోగా పెట్టుబడి వచ్చే పరిస్థితి లేదన్నారు. రైతులను ఆదుకోవాలని లేనిపక్షంలో కాంగ్రెస్ ఆధ్వర్యంలో రాష్ట్ర వ్యాప్తంగా ఆందోళన చేస్తామని ఆయన హెచ్చరించారు.

కాంగ్రెస్ పార్టీ మండలాధ్యక్షుల ఎంపిక

రావులపాలెం, ఏప్రిల్ 17(ఆంధ్రజ్యోతి): కాంగ్రెస్ పార్టీ మండల శాఖ అధ్యక్షులను నియమించినట్లు నియోజకవర్గ పార్టీ ఇన్‌చార్జ్ రౌతు ఈశ్వరరావు తెలిపారు. ఎంపికైన వారికి జిల్లా అధ్యక్షుడు కొండేటి చిట్టిబాబు నియామక పత్రాలను అందజేశారన్నారు.



సర్వేపల్లి రాధాకృష్ణన్ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న విద్యార్థులు

సర్వేపల్లి రాధాకృష్ణన్‌కు పలువురు నివాళి

కొత్తపేట, ఏప్రిల్ 17(ఆంధ్రజ్యోతి): ఉపాధ్యాయ వృత్తికే ఆదర్శంగా నిలిచిన మహోన్నతుడు సర్వేపల్లి రాధకృష్ణన్ అని విద్యాబాలమందిర్ కరస్పాండెంట్ ఆర్.అనురాధ పేర్కొన్నారు. గురువారం ఆయన వర్ధంతిని పురస్కరించుకుని రాధాకృష్ణన్ చిత్రపటానికి పలువురు నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన చేసిన సేవలను కొనియాడారు. కార్యక్రమంలో హెచ్‌ఎం నూకపెయ్యి శివరత్నం, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

బెల్లపు ఊట ధ్వంసం

ఆత్రేయపురం, ఏప్రిల్ 17(ఆంధ్రజ్యోతి): నవోదయం 2.0 కార్యక్రమంలో భాగంగా గురువారం ఆత్రేయపురం మండలం వెలిచేరు గోదావరి లంకలో ఎక్సైజ్ సీఐ కె.కాత్యాయని ఆధ్వర్యంలో సిబ్బంది దాడులు చేశారు. సారా తయారీకి సిద్ధంగా ఉన్న 900 లీటర్ల బెల్లపు ఊటను ధ్వంసం చేసినట్లు ఎస్ఐ కె.అన్నవరం తెలిపారు.

వాడపల్లిలో అభివృద్ధి పనులు వేగవంతం

ఆత్రేయపురం, ఏప్రిల్ 17(ఆంధ్రజ్యోతి): వాడపల్లి వేంకటేశ్వరస్వామి ఆలయంలో అభివృద్ధి పనులు వేగంగా రూపుదిద్దుకుంటున్నాయి. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే మాస్టర్ ప్లాన్ రూపొందించారు. ఎమ్మెల్యే బండారు సత్యానందరావు ఆదేశాల మేరకు ఇక్కడకు వచ్చే భక్తులకు సౌకర్యాలు, క్షేత్రంలో అభివృద్ధి పనులపై దృష్టిపెట్టారు. ఉప కమిషనరు నల్లం సూర్యచక్రధరరావు ఆయా పనులకు ప్రతిపాదనలు రూపొందించి అభివృద్ధి పనులు వేగవంతం చేశారు. ఇప్పటికే గోశాల, పార్కింగ్, క్యూలైన్ల విస్తరణ వంటి పలు పనులను పూర్తి చేశారు. గుడిలో నుంచి భక్తులు బయటకు వెళ్లేందుకు ఇబ్బంది పడుతుండటంతో ఐరన్ ఫ్లైఓవర్ నిర్మాణం చేపట్టారు. భక్తుల రద్దీకి అనుగుణంగా క్యూలైన్లు విస్తరించి ఎండవేడిని నియంత్రించేందుకు తగిన రక్షణ చర్యలు చేపట్టారు. ఆలయం ఎదురుగా రూ.2 కోట్లతో పుష్కరిణి అభివృద్ధి పనులు వేగవంతం చేస్తున్నారు. వకుళమాత అన్నదాన నిర్మాణ పనులు చేపట్టనున్నారు. ఆయా పనులను ఇంజనీరింగ్ అధికారుల పర్యవేక్షణలో యుద్ధ ప్రాతిపదికన చేపడుతున్నారు.





వాడపల్లిలో వెంకన్న ఆలయంలో ఐరన్ ఫ్లైఓవర్ నిర్మిస్తున్న దృశ్యం. పక్క చిత్రంలో పుష్కరిణి అభివృద్ధి పనులు చేస్తున్న కార్మికులు

వినూత్న ఆలోచనలతో ముందుకు సాగాలి

ద్రాక్షారామ, ఏప్రిల్ 17 (ఆంధ్రజ్యోతి): పాఠశాల దశ నుంచే విద్యార్థులు వినూత్న ఆలోచనలతో ముందుకు సాగాలని జిల్లా విద్యాశాఖ అధికారి డాక్టర్ సలీం బాషా అన్నారు. రామచంద్రపురం కృత్తివెంటి పేర్రాజు పంతులు ప్రభుత్వ జాతీయ ఉన్నత పాఠశాలలో గురువారం ఎంటర్‌ప్రెన్యుమర్ మైండ్ సెట్ డెవలప్‌మెంట్ ప్రోగ్రాంలో భాగంగా జిల్లాస్థాయి ఎక్స్పో నిర్వహించారు. రామచంద్రపురం డీవైఈవో పి.రామలక్ష్మీమూర్తి అధ్యక్షతన జరిగిన సమావేశంలో డీఈవో మాట్లాడారు. విద్యార్థి దశ నుంచే అక్షరాస్యతపై అవగాహన పెంచుకోవాలన్నారు. సమావేశంలో ఫైనాన్స్ అండ్ అకౌంట్ అధికారి జీ.ప్రవీణ్‌కుమార్ మాట్లాడుతూ జిల్లాలో ఈఎండీపీ కార్యక్రమాన్ని విజయవంతంగా నిర్వహించడంలో కృషి చేసిన సమగ్రశిక్ష ఏఎంవో పి.రాంబాబు, జిల్లా సైన్స్ అధికారి జీవీఎస్ సుబ్రహ్మణ్యంను అభినందించారు. జిల్లాస్థాయి ఈఎండీపీ ఎక్స్పోను సలీంబాషా ప్రారంభించారు. మండపేట, పాలగుమ్మి, అనాతవరం, ఇందుపల్లి, కాలేరు, పొన్నమండ, అమలాపురం, గంగలకుర్రు అగ్రహారం ఉన్నత పాఠశాలల నుంచి ఈఎండీపీ ప్రాజెక్టులను ప్రారంభించారు. దీనిలో ఉత్తమ ప్రాజెక్టుగా పాలగుమ్మి, మండపేట ఎస్‌జీ ఉన్నత పాఠశాల విద్యార్థులు ప్రథమ, ద్వితీయ స్థానాల్లో నిలిచారు. వీరు రాష్ట్రస్థాయి ఎక్స్పోలో పాల్గొంటారని జోనల్ కోఆర్డినేటర్ నవ్య తెలిపారు. రాష్ట్రస్థాయికి ఎంపికైన విద్యార్థులకు జ్ఞాపికలు, సర్టిఫికెట్‌లు అందజేశారు. కార్యక్రమంలో విద్యాశాఖ మండల అధికారులు తాడి వీరరాఘవరెడ్డి, బి. శ్రీనివాసరాజు, సీహెచ్‌వీ సోమిరెడ్డి, వాసంశెట్టి నాగేశ్వరి, పాఠశాల ఉపాధ్యాయులు పాల్గొన్నారు.



విజేతలకు సర్టిఫికెట్‌లు అందజేస్తున్న జిల్లా విద్యాశాఖాధికారి సలీం బాషా

డిమాండ్లు పరిష్కరించాలంటూ అధికారులకు వినతి



ఏవోకు వినతిపత్రాన్ని ఇస్తున్న ఉపాధి క్షేత్ర సహాయకులు

రావులపాలెం, ఏప్రిల్ 17(ఆంధ్రజ్యోతి): తమ డిమాండ్లను పరిష్కరించాలంటూ క్షేత్ర సహాయకులు అధికారులకు వినతిపత్రాలను అందచేశారు. రావులపాలెం మండల పరిషత్ కార్యాలయంలో ఏవోకు వినతిపత్రాన్ని అందచేశారు. ఉపాధి హామీపథకంలో పనిచేస్తున్న ఫీల్డ్ అసిస్టెంట్లను ఉద్యోగులుగా గుర్తించకపోవడం 2016 నుంచి జీతాలు పెంచకుండా చులకనగా చూడటంపై నిరసనగా కార్యాచరణ రూపొందించినట్లు తెలిపారు. విద్యార్హతల ఆధారంగా పదోన్నతులు ఇవ్వాలని కోరారు. ఈనెల 21న పనులు ఆపి పెన్‌డౌన్‌తో పాటు, 28 నుంచి విధులను బహిష్కరించి నిరవధిక సమ్మె చేపడతామని తదితర డిమాండ్లతో అధికారులకు వినతిపత్రాలను అందచేశారు.

ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థుల సంఖ్యను పెంచాలి



విద్యార్థులను ప్రభుత్వ పాఠశాలలో చేర్పిస్తున్న డీవైఈవో తదితరులు

రాయవరం, ఏప్రిల్ 17(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థుల సంఖ్య పెంపొందించేందుకు ఉపాధ్యాయులు నిరంతరం కృషి చేయాలని రామచంద్రపురం డీవైఈవో ప్రత్తి రామలక్ష్మణ మూర్తి పిలుపునిచ్చారు. గురువారం వెంటూరు గ్రామంలో ఎన్‌రోల్‌మెంట్ డ్రైవ్ నిర్వహించారు. కార్యక్రమంలో పాల్గొన్న డీవైఈవో మాట్లాడుతూ ప్రైవేటు పాఠశాలలకు దీటుగా ప్రభుత్వ పాఠశాలల్లో ప్రభుత్వం కల్పిస్తున్న సౌకర్యాలను విద్యార్థులు, తల్లిదండ్రులు సద్వినియోగం చేసుకోవాలన్నారు. గ్రామంలో ఇంటింటికీ పర్యటించి 20 మంది విద్యార్థులను ప్రాథమిక, ఉన్నత పాఠశాలల్లో చేర్పించారు. కార్యక్రమంలో హెచ్‌ఎం వీరభద్రరావు, సీఆర్పీ వి.సీత ధనలక్ష్మి, కడలి శ్రీనివాస్, వార్డు మెంబరు ఏడుకొండలు, గొడితి మురళి, అంగన్‌వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.

బీజేపీలో చేరిన సర్పంచ్ వెంకటనాగస్రవంతి



బీజేపీలో చేరిన సర్పంచ్ వెంకట నాగస్రవంతి

కపిలేశ్వరపురం, ఏప్రిల్ 17(ఆంధ్రజ్యోతి) : మండలంలోని వాకతిప్ప గ్రామ సర్పంచ్ కొరిపెల్ల వెంకటనాగస్రవంతి బీజేపీలో చేరారు. రాజమహేంద్రవరం జిల్లా కార్యాలయంలో రాష్ట్ర అధ్యక్షురాలు దగ్గుబాటి పురందేశ్వరి ఆధ్వర్యంలో పార్టీలో చేరినట్లు ఆమె తెలిపారు. ముఖ్య అతిథిగా ఎమ్మెల్సీ సోము వీర్రాజు ఈ కార్యక్రమానికి హాజరయ్యారని, పార్టీ పై అభిమానంతో ఈ నిర్ణయం తీసుకున్నట్టు తెలిపారు. కార్యక్రమం లో బీజేపీ మండల అధ్యక్షులు నామాల శ్రీను, జిల్లా కార్యదర్శి వసంత, తోరం రాము, ఎస్.సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

కొత్తపేట బార్ అసోసియేషన్ అధ్యక్ష, కార్యదర్శులు ఎంపిక

కొత్తపేట, ఏప్రిల్ 17(ఆంధ్రజ్యోతి): కొత్తపేట బార్ అసోసియేషన్ ఎన్నికలు ఏకగ్రీవంగా జరిగాయి. అధ్యక్షుడిగా నేతల మోహనరావు, కార్యదర్శిగా బండారు రామకృష్ణ ఎన్నికయ్యారు. ఉపాధ్యక్షుడిగా బీర తాతారావు, సంయుక్త కార్యదర్శిగా నూకపెయ్యి రమేష్, కోశాధికారిగా జి.శంకరుడు, లైబ్రరీ కార్యదర్శిగా జి.బాలప్రతాప్, మహిళా ప్రతినిధిగా పి.భవానిలను ఎన్నుకున్నారు. వీరిని సీనియర్ న్యాయవాదులు సాకా ఏసురత్నం, సత్యవాడ సందీప్, పప్పుల రామదొర, యెలిశెట్టి వెంకటేశ్వరరావు తదితరులు అభినందించారు.

అగ్ని ప్రమాదాలపై విద్యార్థులకు అవగాహన

కొత్తపేట, ఏప్రిల్ 17(ఆంధ్రజ్యోతి): అగ్నిమాపక వారోత్సవాల్లో భాగంగా గురువారం అగ్నిమాపకాధికారి శ్రీనివాస్ ఆధ్వర్యంలో భాష్యం స్కూల్‌లో విద్యార్థులకు అవగాహన కల్పించారు. అగ్నిప్రమాదాలు సంభవించినప్పుడు ఎలా రక్షించుకోవాలో డెమో ద్వారా సూచించారు. అగ్నిప్రమాదాలు జరిగినప్పుడు తీసుకోవాల్సిన జాగ్రత్తలపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో జోనల్ ప్రిన్సిపాల్ జె.శ్రీనివాస్, ప్రిన్సిపాల్ ఎం.లోకేశ్వరరావు, ఎస్.రమాజ్యోతి, అగ్నిమాపక సిబ్బంది పాల్గొన్నారు.

ఆర్టీసీ ఉద్యోగుల ధర్నా

రామచంద్రపురం(ద్రాక్షారామ), ఏప్రిల్ 17(ఆంధ్రజ్యోతి): ఆర్టీసీ ఉద్యోగుల రాష్ట్ర వ్యాప్త పిలుపు మేరకు గురువారం ఆర్టీసీ డిపో ముందు ధర్నా చేశారు. 1/2019 సర్క్యులర్ అమలు చేయాలని, గ్యారేజీ కార్మికులకు పనిముట్లు ఇవ్వాలని ధర్నా చేశారు. కార్యక్రమంలో అధ్యక్షుడు సీహెచ్‌వీ రావు, కార్యదర్శి ముత్యాలరావు, పలువరు కార్మికులు తదితరులు పాల్గొన్నారు.

బాస్కెట్‌బాల్ క్రీడాకారిణికి డీఈవో ప్రశంస

రామచంద్రపురం(ద్రాక్షారామ), ఏప్రిల్ 17 (ఆంధ్రజ్యోతి): కృత్తివెంటి పేర్రాజు పంతులు ప్రభుత్వ జాతీయోన్నత పాఠశాల పదవ తరగతి విద్యార్థిని, బాస్కెట్‌బాల్ క్రీడాకారిణి చేకూరి ఐశ్వర్యాంబికను డీఈవో సలీంభాష ప్రశంసించారు. మెడల్, ప్రశంసాపత్రం అందచేసి ఆమెను అభినందించారు. కార్యక్రమంలో డీవైఈవో డి.రామలక్ష్మణమూర్తి, ఎంఈవోలు టీవీ రాఘవరెడ్డి, నాగేశ్వరి, విద్యా కమిటీ చైర్మన్ గంగరాజు పాల్గొన్నారు.

విద్యార్థుల ప్రతిభ

కొత్తపేట, ఏప్రిల్ 17(ఆంధ్రజ్యోతి): గోదావరి ఒలింపియాడ్ నిర్వహించిన మ్యాథ్స్, సైన్సు టాలెంట్ టెస్టులో కాంతి భారతి విద్యార్థులు ప్రతిభ కనబరిచారు. గురువారం వారిని కరస్పాండెంట్ టి.సత్యవాని, ఉపాధ్యాయులు అభినందించారు.